తెలుగు దిన పత్రిక

http://aksharagalam.com

# అక్షరగళం

నిజం..నిర్భయంగా

హైదరాబాద్ | గురువారం | 12-02-2026 | సంపుటి-03 | సంచిక-247 | పేజీలు - 08 | వెల:3/–

## వందేమాతర గీతం ఇక తప్పనిసరి

జగనణమన కంటే ముందే
వందేమాతరం
ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం



**అక్షరగళం, న్యూఢిల్లీ,ఫిబ్రవరి11:**

అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా అన్ని పౌరపురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని తెలిపింది. అయితే సినిమా హాళ్లలో దీనిని ప్రదర్శించాల్సిన అవసరం లేదని నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. కొత్త నిబంధనల మిగతా 4లో


## ఓటేసిన పలువురు ప్రముఖులు



### కొడంగ్‌లో ఓటేసిన సీఎం రేవంత్

- మధిరల ఓటేసిన భట్టి విక్రమార్క

**హైదరాబాద్,ఫిబ్రవరి11:** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. 04





### ఓటు హక్కు వినియోగించుకున్న పీసీసీ చీఫ్


**నిజామాబాద్,ఫిబ్రవరి11:** పట్టణంలోని సన్ ఫ్లవర్ హైస్కూల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం ఓటు అని, ఓటింగ్ శాతం పెరిగినప్పుడే సమాజానికి మేలు చేసే నాణ్యమైన నాయకులు వస్తారని పేర్కొన్నారు. నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



### కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

- ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదని వ్యాఖ్య
- కెసిఆర్‌పై చర్యలకు వెనకాడుతున్నారని విమర్శ

**అక్షరగళం, కరీంనగర్,ఫిబ్రవరి11:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జ్యోతినగర్ ఎసఆర్ హైస్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారో సీఎం సమాధానం 04




## ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

సాయంత్రం క్యూలో ఉన్న వారికి ఓటింగ్ అవకాశం
చెదురుమొదురు ఘటనలు మినహా ప్రశాంతం
మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప ఉద్రిక్తతలు
పలుచోట్ల పరస్పర ఘర్షణలు
దొంగ ఓట్ల ఆరోపణలతో పోలీసుల జోక్యం

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి11:**

చెదురుమొదురు ఘటనలు మినహా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలో నిలుచున్న వారికి మాత్రమే అధికారులు ఓటు వేసే అవకాశం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 13న ఓట్లు లెక్కింపు మిగతా 2లో

## మున్సిపోల్స్‌పై పీపుల్స్ పల్స్ సర్వే

### అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు

7 కార్పోరేషన్లలో 5 కాంగ్రెస్, 2 బిజెపి గెలుపు
పలుచోట్ల ఎంఐఎం కీలకం కానుందని వెల్లడి



**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి11:**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కోలాహలం ముగిసింది. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివెళ్లారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిపోగా.. బూత్ లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అయితే, ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఈ పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోనుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది. వారి అంచనాల మేరకు మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబుబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు ప్రద్శించింది. కరీంనగర్, నిజమాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ రెండు మిగతా 2లో



## మున్సిపోల్స్‌లో రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగం

ఎక్స్ వేదికగా కెటిఆర్ తీవ్ర ఆరోపణలు

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి11:**

మున్సిపల్ ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో గులాబీ పార్టీ శ్రేణులను ఉద్దేశిస్తూ మాజీ మంత్రి, బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అలానే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ రేవంత్ రెడ్డి పై కేటీఆర్ మిగతా 4లో


## మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ సర్వీసులు
శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయల తదితర క్షేత్రాలకు




**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి11:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహాశివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. మిగతా 2లో



## అధికార దుర్వినయోగం... ఉల్లంఘనలు

మున్సిపోల్స్‌పై హరీష్ రావు విమర్శలు

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి11:**

మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక మిగతా 2లో

## మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

జలమండలి పరిధి విస్తరిస్తూ
ప్రభుత్వం ఉత్తర్వులు
జీహెచఎంసీ కమిషనర్‌గా
ఆర్వీ కర్ణన్ 02




## స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా ప్రగతి పయనం
19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగాం
2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు
విద్యుత్, సాగునీటి పారుదల రంగాల్లో తిరోగమనం
వ్యవస్థల నిర్వీర్యంతో కుంటుపడిన అభివృద్ధి రంగం
ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం 02



## అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

వాణిజ్య ఒప్పందంతో
అమెరికాకే లాభం 04
ఎన్‌స్టీన్ ఫైల్‌స్‌లో అనిల్
అంబానీ, హర్దీప్ పురిల ప్రస్తావ
బడ్జెట్ చర్చలో రాహుల్ విమర్శలు
రాహుల్ వ్యాఖ్యలపై గందరగోళం



## మూసీ ప్రాజెక్టులో కీలక అడుగు

భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్

**అక్షరగళం, హైదరాబాద్,ఫిబ్రవరి11:**

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ పక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ మిగతా 2లో

## ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ


500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు
ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు
ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు 02

# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం



**అమరావతి,ఫిబ్రవరి11:** రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలను చవిచూసిందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు రాష్ట్ర పురోగతికి విఘాతం కలిగించిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజా సంక్షేమం అనే కోణంలోనే.. ప్రభుత్వం ప్రతీ నిర్ణయాన్ని తీసుకుంటోందని తెలిపారు. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రయోజనం చేకూరుతోంద న్నారు. 66 లక్షలకు పైగా విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా ఆర్థిక సాయం అందుతోందని గవర్నర్ వెల్లడించారు. 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగు నీటి పారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవిచూశాయి. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ప్రజలు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. గత 19 నెలలుగా మా ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోంది. సూపర్`6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాం. విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు చేశాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి పది సూత్రాలను రూపొందించాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశించిందని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని గవర్నర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతోందన్నారు. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్ల రిక్రూట్మెంట్ కూడా ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు. మత్స్యకార సేవలో పథకం ద్వారా 1.2 లక్షల మందికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు. లక్ష మందికి పైగా హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని గవర్నర్ చెప్పారు. విభజన సమస్యలతో పాటు వారసత్వంగా వచ్చిన ఆర్థిక నష్టాలతో ప్రభుత్వం పాలన ప్రారంభించిందని అబ్దుల్ నజీర్ చెప్పుకొచ్చారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గత పాలకులు ధ్వంసం చేశారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందని.. ఆర్థికపరమైన ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా గత పాలకులు పాలించారని.. 22ఏ అధికరణను దుర్వినియోగం చేశారన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, సాగునీరు, రహదారులు లాంటి రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని గవర్నర్ తెలిపారు. 2024లో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పజెప్పారని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందని వెల్లడించారు. 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని పునర్నిర్మించి గాడిలో పెట్టిందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రీస్టార్ట్ అయ్యాయని తెలిపారు. తొలి 9 నెలల కాలంలో దిద్దుబాటు చర్యలు, పాలసీలు, వ్యవస్థల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసి పారదర్శకమైన పాలనను కూటమి ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పాలన సాగిస్తోందన్నారు. పది సూత్రాలను నిర్దేశిరచుకుని.. ప్రజలకు సుపరిపాలన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకంగా చేసుకుని ప్రభుత్వ పాలన సాగుతోందని అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని గవర్నర్ వెల్లడించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతీ కుటుంబానికి అవసరమైన ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. త్వరలో ఫ్యామిలీ కార్డును అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పీ4 ద్వారా పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరూ ఆకలితో ఉండకూడదనే సూత్రంతో 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. త్వరలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ గ్రామీణ అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని గవర్నర్ నజీర్ వెల్లడించారు. అందరికీ ఇల్లు.. అనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు గవర్నర్. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం.. వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనారిటీలకు భద్రత, వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్య, ఆర్థిక సహకారంతో మేలు చేకూరుస్తోందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు. రాష్ట్రం ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి రంగాల్లో దూసుకెళ్తోందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలు.. ఏపీని పెట్టుబడులు, నాలెడ్జ్ ఎకానమీకి గమ్యస్థానంగా ఎంచుకున్నాయని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గవర్నర్ వివరించారు. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గించేలా.. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోందన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి రూ.2.5 లక్షల వరకూ సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోందన్నారు. 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదురహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోందని అన్నారు. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ప్రభుత్వం ఈ బృహత్ పథకాన్ని చేపడుతోందని చెప్పారు గవర్నర్. వృద్ధుల సంఖ్య పెరగడం వివిధ దేశాలకు సవాల్‌గా మారిందని.. దీనిపై సరైన విధానాన్ని రూపొందించాలని సభను కోరుతున్నట్లు గవర్నర్ తెలిపారు. అక్రమ మద్యం తయారీ నుంచి విముక్తి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. గంజాయి నిర్మూలనలో పురోగతి సాధించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారన్నారు. అభివృద్ధి వ్యూహంలో మహిళలే కేంద్ర బిందువులని.. ఆర్థిక భాగస్వాములు, స్వయం పేరుతో డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తోందన్నారు. ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని.. వచ్చే ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశిరచుకుందని తెలిపారు. అంగన్ వాడీలను బలోపేతం చేసి.. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం కూడా అందిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్




(మొదటిపేజీ తరువాత)

ఉంటుందని, 16న కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. తుది ఓటింగ్ శాతం రాత్రికి వెల్లడి కానుంది. ఎన్నికల బరిలో ఉన్నవారి అదృష్టం ఈనెల 13న తేలబోతుంది. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుంది.:ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ పక్రియ, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట టోకెన్లు జారీ చేసి ఓటింగ్ నిర్వహిస్తున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేస్తారు. పోలీసుల భారీ భద్రత నడుమ వీటిని నిర్దేశించిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికే దాదాపు 62శాతం పైగా పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో ఓటింగ్ శాతం కార్పొరేషన్ల కంటే మెరుగ్గా ఉన్నట్లు ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలన్నీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

**మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప ఉద్రిక్తతలు**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. పోలింగ్ కొనసాగుతున్న వేళ పలు జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్యకర్తల మధ్య ఘర్షణలు, నినాదాలు, దొంగ ఓట్ల యత్నాలు వంటి ఘటనలు వెలుగుచూశాయి. పోలీసులు వేగంగా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 పోలింగ్ బూత్‌ల వద్ద స్వల్ప ఘర్షణలు జరిగాయి. 14వ వార్డులో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆరఎస్ అభ్యర్థుల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఘర్షణకు దిగాయి. కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆరఎస్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత పెరిగింది. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు 14వ వార్డులో భారీగా పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం 9 గంటల వరకు 14 శాతం పోలింగ్ నమోదైంది. నగరంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు.. వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పెద్ద ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆరఎస్ కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేస్తూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని రాకాసిపేట్ పోలింగ్ కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వారిని అడ్డుకుని కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులోనూ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఓటర్లను ప్రలోభ పెడుతున్నారంటూ బీజేపీ, బీఆరఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.బీజేపీ, బీఆరఎస్ ఇరువర్గాల మధ్య బాహాబాహీ చోటుచేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని అధికారులు తెలిపారు.సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓ వ్యక్తి దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించాడు. అప్పటికే మరో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన సదరు వ్యక్తి.. 28వ వార్డులో మరోసారి ఓటు వేసేందుకు వచ్చినట్లు గుర్తించారు. అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆ వ్యక్తి చేతి వేలికి సిరా గుర్తువేసి పోలింగ్ కేంద్రం నుంచి పంపించారు. చట్టపరంగా ఆ వ్యక్తిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు తెలిపారు.

# మున్సిపోల్స్‌పై పీపుల్స్ పల్స్ సర్వే

(మొదటిపేజీ తరువాత)



మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుంది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానున్నదని వెల్లడించింది. ప్రధాన ప్రతిపక్షం బీఆరఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని చెప్పింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకోనుందని సర్వే చెప్పింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి, వాటిని కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆరఎస్ పార్టీకి ఈ ఎన్నికలు కోలుకోలేని దెబ్బ తీసేలా ఉన్నాయని తెలిపింది.. ఒక్క మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా గెలుచుకునే అవకాశం ఆ పార్టీకి లేదని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ కార్పొరేషన్లలో అధికార పీఠాన్ని నిర్ణయించడంలో ఎంఐఎం కీలక పాత్ర పోషించనుందని సర్వే వెల్లడించింది.116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ 36శాతం , బీఆరఎస్ 29.7శాతం, బీజేపీ 19.3శాతం ఓట్లను సాధించవచ్చని సర్వే పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ 1210`1290 వార్డులను, బీఆరఎస్ 860`930 వార్డులను, బీజేపీ 250`270 వార్డులను గెలుచుకునే అవకాశం ఉందని సర్వే చెబుతోంది. మొత్తంగా చూస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత పటిష్ఠం చేసుకోగా, బీఆరఎస్, బీజేపీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతున్నాయనే విధంగా సర్వే ఫలితాలు వెలువరించింది రామగుండంలో కాంగ్రెస్ 30`34, బీఆరఎస్ 16`20, బీజేపీ 3`6, ఇతరులు 4`7 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మంచిర్యాలలో కాంగ్రెస్ 39`43, బీఆరఎస్ 8`12, బీజేపీ 6`9, ఇతరులు 1`2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్ 28`34, బీఆరఎస్ 7`9, సీపీఐ 14`16, ఇతరులు 2`4 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ 26`30, బీఆరఎస్ 18`22, బీజేపీ 6`8, ఎంఐఎం 2`4, ఇతరులు 0`1 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. నల్లగొండలో కాంగ్రెస్ 21`26, బీఆరఎస్ 8`12, బీజేపీ 6`10, ఎంఐఎం 2`4, ఇతరులు 1`2 వార్డులు గెలుపొందే అవకాశం. నిజామాబాద్ లో కాంగ్రెస్ 10`16, బీఆరఎస్ 2`4, బీజేపీ 26`31, ఎంఐఎం 8`12, ఇతరులు 1`2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కరీంనగర్ లో కాంగ్రెస్ 14`16, బీఆరఎస్ 10`12, బీజేపీ 24`29, ఎంఐఎం 6`9, ఇతరులు 1`3 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మొత్తంగా 68`76 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. 29`36 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆరఎస్, 3`5 బీజేపీ, 0`1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ తన సర్వే ఫలితాల్లో పేర్కొంది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆరఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 1210`1290, బీఆరఎస్ 860`930, బీజేపీ 250`270, ఏఐఎంఐఎం 35`44, సీపీఐ 12`17, సీపీఎం 10`14, ఇతరులు 90`110 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం ఉందని సర్వే పేర్కొంది. ముఖ్యంగా మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేయనుందని సర్వే అంచనా వేసింది.

# మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

**హైదరాబాద్,ఫిబ్రవరి11:** జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆరఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్‌ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల




మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. జీహెచ్‌ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. ఖైరతాబాద్ జోన్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట. రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, గోల్కొండ జోన్: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్. సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

## మూసీ ప్రాజెక్టులో కీలక అడుగు

(మొదటిపేజీ తరువాత)

కార్పొరేషన్ లిమిటెడ్(ఓఖీఆఅబ) బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు పరిధిలో అధికారులు భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు .హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు పక్రియ ప్రారంభమైంది. భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ పక్రియను అధికారులు చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ` మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసి అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగనున్నాయి. మొత్తం గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల పరిధిలో, 14 మండలాలు, 46 గ్రామాల్లో మూసీ అభివృద్ధి జరగనుంది.

## అధికార దుర్వినయోగం...ఉల్లంఘనలు

అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆరఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆరఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆరఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.




# మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

(మొదటిపేజీ తరువాత)

అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గత శివరాత్రి కంటే ఈసారి 208 బస్సులను అదనంగా సంస్థ నడుపుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్‌ను లిలిలి.బిణబసబిఞశిబీబ.తిని వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎసఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040`69440000, 040`234500332లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి11:** అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్ పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించిందని రాహుల్ గాంధీ అన్నారు.మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీ పేరు వచ్చినా.. ఎందుకు జైలులో పెట్టలేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యాపారవేత్త అనీల్ అంబానీ ఎందుకు జైలులో లేడని నేను అడగాలనుకుంటున్నాను? దీనికి కారణం ఆయన పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉంది. అతన్ని (అనీల్ అంబానీ) ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసిన హర్‌దీప్ పూరిని కూడా నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. అతన్ని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. హర్దీప్ పూరికి అతన్ని ఎవరు పరిచేశారో తెలుసు' అని అన్నారు. పరోక్షంగా రాహుల్ మోడీనుద్దేశించి వ్యాఖ్యానించారు. బ్జడెట్ పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బ్జడెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.



# విశ్వగురు భావన ఓ భ్రమ!

దేశంలో గడిచిన పదకొండేండ్లుగా విదేశాంగ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని ప్రపంచ నాయకత్వంగా, విశ్వగురు పేరిట ప్రచారం జరుగుతున్నది. కానీ జాగ్రత్తగా పరిశీలించి విశ్లేషిస్తే ఇందులో లోపాలు గమనించవచ్చు. విశ్వగురు భావనలో స్పష్టత, స్థిరత్వం లోపించిందని గుర్తించవచ్చు. మోదీ రాజనీతిలో లోపాలు బయటపడుతాయి. విదేశీ పర్యటనల్లో ఆర్భాటపు కార్యక్రమాలు, జరిగిన వ్యూహాత్మక ప్రయోజనానికి పొంతన ఉండదు. మాటల్లో చెప్పకున్నంత మేరకు లక్ష్యాలను చేరుకోలేదని, ఫలితాలు సాధించలేదని తెలిసిపోతుంది.

ప్రస్తుతం భారతదేశంలో వ్యవసాయ మార్కెట్‌లోకి అమెరికాను ఆహ్వానించడం వెనుక మన పాలకులపై ఉన్న ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తున్నది. ఇది మన దేశ రైతుల జీవనాధారాన్ని దెబ్బతీస్తుంది. ఇటీవలి కాలంలో జరిగిన రైతు ఆందోళనల నేపథ్యంలో అన్నదాతలకు మరిన్ని సమస్యలు పొంచి ఉన్నాయని స్పష్టమవుతున్నది. నరేంద్రమోదీ ప్రధానిగా 79 దేశాల్లో 97 సార్లు పర్యటించారు. అంటే సగటున ఏడాదికి 9 సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లారన్నమాట. ప్రధాని మోదీ ఇన్ని దేశాలకు ఇన్నిసార్లు వెళ్లి వచ్చినా ఆయా దేశాలతో వాణిజ్య, వ్యూహాత్మక, సాంస్కృతిక రంగాల్లో లోతైన సంబంధాలు ఏమైనా నిర్మించారా? అనే ప్రశ్న తలెత్తుతున్నది. కానీ అంతర్జాతీయంగా ఫలితాలను చూస్తే పరిస్థితులు నిరాశాజనకంగానే ఉన్నాయి. భారతదేశ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్ 2013లో 74వ స్థానంలో ఉంటే పదకొండేండ్ల విశ్వగురు పాలనలో 80వ స్థానానికి పడిపోయింది. ఇక విదేశీ ప్రత్యక్ష నికర పెట్టుబడులు (నెట్ ఎఫ్‌డీఐ) కేవలం 0.35 బిలియన్ డాలర్ల వద్ద నిలిచిపోయాయి. అంటే పెట్టుబడుల ప్రవాహం పరిమితంగానే ఉన్నదని స్పష్టమవుతున్నది. వాణిజ్యం, పర్యాటకం నిర్మాణాత్మకంగా పెరగలేదు. ఇక విదేశాలతో భద్రతాపరమైన సంబంధాల్లోనూ సాధించింది ఏమీ లేదనే విషయం అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సహజమైన మద్దతు లభించాల్సిన విషయంలో భారత వైఖరిని విదేశాల్లో వివరించే ఎంపీల బృందానికి ప్రధానంగా విపక్ష ఎంపీలు నాయకత్వం వహించాల్సి వచ్చింది. గతంలో జాతీయ నేతలు తమను తాము గురు అని ప్రకటించుకోలేదు. ఎలాంటి ఆర్భాటం లేకుండా మౌనంగానే సమర్థతతో ఘనమైన విజయాలు సాధించారు. ఉదాహరణకు నెహ్రూ హయాంలో అలీన విధానం, ఇందిరాగాంధీ హయాంలో 1971 నాటి దౌత్యం, వాజపేయి పాలనలో లాహోర్ పర్యటనను చెప్పవచ్చు. కానీ మోదీ పాలనలో గుణాత్మక మార్పులు పెద్దగా కనిపించవు. క్వాడ్ పునరుద్ధరణ ద్వారా చైనా దూకుడును కొంతమేరకు మాత్రమే అడ్డుకోగలిగారు. జీ20కి ఆతిథ్యం, ఆఫ్రికన్ యూనియన్ చేరిక ఫలితాలనిచ్చాయి. ప్రపంచ ఆర్థిక అస్థిరతల నేపథ్యంలో రష్యా చమురు దిగుమతులతో ఆర్థిక ఉపశమనం లభించింది.

ఇండియా, ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ స్టేట్స్ (ఐ2యూ2) కూటమి ఆరంభ దశలోనే నిలిచిపోయింది. సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. క్వాడ్ నుంచి నిర్ణయాత్మక మద్దతు కనిపించలేదు. వాణిజ్య లోటు వెంటాడుతూనే ఉన్నది. సార్వభౌమత్వం అంటూ మాటలు మోగుతూనే ఉన్నాయి, ఆచరణలో మాత్రం విదేశీ ఒత్తిడులకు తలొగ్గినట్టు కనిపిస్తున్నది. అమెరికా ఒత్తిడితో ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయడం ఇందుకు ఓ ఉదాహరణ.

అమెరికా ఒత్తిడితో ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్ల నిలిపివేత తరహాలోనే ఇప్పుడు అమెరికాకు చెందిన మొక్కజొన్న, సోయా, పాల ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతించడం స్పష్టంగా గమనించవచ్చు. భారతదేశంలోని 14 కోట్ల మంది రైతుల్లో 90 శాతం మంది సన్నకారు రైతులే ఉన్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతిస్తే మన రైతుల జీవనం ప్రమాదంలో పడుతుంది. కేంద్రం 2020-21లో వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలను తీసుకొచ్చింది. తమ భవితవ్యాన్ని కార్పొరేట్ శక్తుల నియంత్రణలో పెట్టడానికి అంగీకరించే ప్రసక్తే లేదని అన్నదాతలు స్పష్టంచేశారు. 1991 నాటి సంస్కరణల తర్వాత చేనేత రంగం కుదేలైనట్టుగానే వ్యవసాయం సంక్షోభం ఎదుర్కొంటుందని ఆందోళన చెందుతున్నారు. లక్షలాది మంది రైతులు 13 నెలలపాటు ఉద్యమించారు. దీంతో కేంద్రం ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నది.

ప్రస్తుతం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కోసం రైతులు గొంతెత్తుతున్నారు. అస్థిరమైన ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో చలో ఢిల్లీ అని నినదిస్తూ ర్యాలీలు చేస్తున్నారు. జాతీయ రహదారులను దిగ్బంధిస్తున్నారు. అమెరికా ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి ప్రవేశిస్తే గోధుమ, పాల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరపై ప్రతికూల ప్రభావం పడుతుంది. పంజాబ్, హర్యానా ధాన్యాగారాలు వెలవెలబోయే ప్రమాదం ఉన్నది. రష్యా దిగుమతుల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించిన భారత ప్రభుత్వం, ఇరాన్ చమురు దిగుమతుల త్యాగాల తర్వాత అమెరికా ఆహార ఉత్పత్తుల విషయంలో ఎందుకు వెనక్కి తగ్గాలి అనే ప్రశ్న తలెత్తుతున్నది.

స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా మహాత్మా గాంధీ చేపట్టిన దండి యాత్ర విదేశీ వస్తు దిగుమతులకు వ్యతిరేకంగా సాగింది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఆత్మనిర్భరతనే భారత ఆహార భద్రతకు రక్షణ కవచంగా నిలిచింది. ఇలాంటి చారిత్రక అంశాల కోణంలో చూసినప్పుడు అమెరికా ఆహార ఉత్పత్తుల దిగుమతులపై ఆందోళన మరింత పెరుగుతున్నది. విదేశీ విధానం ఫలితాలను ఇవ్వాలి. సంక్షోభాలు నెలకొన్నప్పుడు వివిధ దేశాలతో స్నేహాలు పరీక్షకు నిలుస్తాయి. ఇలాంటి సందర్భంలోనే జాతీయ ప్రయోజనాలపై విస్తృతమైన చర్చ జరుగుతుంది. వాణిజ్య లోటు పెరుగగా, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు స్థిరంగానే కొనసాగుతున్నాయి. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, రైతుల భవిష్యత్తుపై ఆందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఇలా ఏ ప్రమాణాల ప్రకారం చూసుకున్నా విదేశాంగ విధానాలతో సాధించిన ఫలితాలను గమనిస్తే మోదీ విదేశాంగ విధానం బలహీనంగానే ఉన్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితులు నెలకొనలేదని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

అమెరికా నేతృత్వంలోని బోర్డ్ ఆఫ్ పీస్ కార్యక్రమంలో మనదేశం పాల్గొనడం విషయంలోనూ మోదీపై విమర్శలు ఉన్నాయి. ఎలాంటి ప్రతిఫలం హామీ లేకుండానే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పట్ల బ్రిక్స్ (BRICS), జీ 77 వంటి గ్లోబల్ సౌత్ వేదికలపై భారతదేశ విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉన్నదని విదేశాంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. విదేశాంగ విధానం అనేది జాతీయ ప్రయోజనాలతో ముడిపడి ఉండాలి. కానీ సదస్సుల్లో హాజరు కావడం వల్ల మాత్రమే ప్రయోజనం ఉండదు. ఇప్పుడు భారతీయ వ్యవసాయాన్ని దెబ్బతీసే నిర్ణయంలో అమెరికా ఒత్తిడి పని చేస్తున్న వేళ మోదీ విశ్వగురు ముసుగు తొలగిపోతున్నది. విశ్వగురు భావన కేవలం ఒక భ్రమ, మాయాజాలం మాత్రమేనని స్పష్టమవుతున్నది. అప్పుడే మాటల్లో చెప్పే విశ్వగురు భావన, చేతలతో పోలినట్టు అవుతుంది. లేకపోతే విశ్వగురు భావన ఒక భ్రమ అనే సంగతి నిర్ధారణ అవుతుంది.

# కించపర్చడం కాంగ్రెస్, బీజేపీ సంస్కృతి!

దేశవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు.. సభ్య సమాజం అసహ్యించుకునేలా ఉన్నాయి. ఎవరిని విమర్శిస్తున్నాం అనేది గుర్తుంచుకోవడం లేదు. తమకు ఉన్న స్థాయి ఏంటని కూడా గుర్తించడంలేదు. చిన్నంతరం, పెద్దంతరం లేకుండా అవాకులు, చెవాకులు పేలుతున్నారు. శాశ్వతమనే భ్రమలో విర్రవీగుతున్నారు. ఆ రెండు పార్టీల జుగుప్సాకరమైన భాష, దుష్ట రాజకీయం రచ్చకెక్కుతున్నది. రెండు పార్టీల తీరును ప్రజాస్వామికవాదులు అసహ్యించుకుంటున్నారు. మరి ఇది ఆ రెండు పార్టీలకు కొత్తనా అంటే.. అసలు ఆ పార్టీల సంస్కృతే అంతది.

మర్యాదలు, పద్ధతులను మంటగలిపి రాజకీయ ప్రత్యర్థులను దూషించడం, నీచాతినీచంగా కించపర్చడంలో కాంగ్రెస్, బీజేపీకి సుదీర్ఘ చరిత్ర ఉన్నది. ఈ నెల 4, 5వ తేదీల్లో పార్లమెంట్ వేదికగా ప్రధాని నరేంద్రమోదీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ పౌరులను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఇటీవల లోక్‌సభలో గొడవ చేసినందుకు సస్పెండ్ అయిన పంజాబ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీలకు సంఘీభావంగా రాహుల్‌గాంధీ నిలబడి మాట్లాడారు.

పార్లమెంట్ భవనం ద్వారం వద్ద రాహుల్ బృందం నిరసన తెలుపుతుండగా లోపలకి ప్రవేశించే క్రమంలో కేంద్రమంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టూ మెట్లు ఎక్కడానికి అక్కడికి వచ్చారు. ఆయనను ఉద్దేశించి రాహుల్, 'ఇక్కడ గద్దార్ (ద్రోహి) నడుచుకుంటూ వస్తున్నాడు. అతని ముఖం వంక చూడండి, ఎలా ఉన్నాడో తెలుస్తుంది,' అంటూ బిట్టూతో కరచాలనం చేయడానికి చేయి ముందుకు చాపారు. అంతటితో ఆగకుండా, 'హలో బ్రదర్, నా గద్దార్ దోస్త్! దిగులు చెందకు. నువ్వు మళ్లీ వెనక్కి వస్తావు (కాంగ్రెస్‌లో చేరిపోతావు)' అని ఎగతాళిగా మాట్లాడారు.

రాహుల్‌తో కరచాలనం చేయడానికి బిట్టూ నిరాకరిస్తూ, రాహుల్ వైపు తిరిగి, 'దేశ్ కే దుష్మన్' (దేశ శత్రువు) అని పదేపదే దూషించారు. గతంలో మూడు సార్లు కాంగ్రెస్ తరపున ఎంపీగా ఉన్న బిట్టూ 2024 పార్లమెంటు ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. లూథియాణా నుంచి పోటీచేసి ఓడిపోయినా గాని వెంటనే మోదీ కొత్త మంత్రివర్గంలో బిట్టూ స్థానం సంపాదించారు. బీజేపీ ఆయనను రాజస్థాన్ నుంచి రాజ్యసభకు పంపించింది. ఇక తాజా గొడవ విషయానికి వస్తే కాంగ్రెస్ ఎంపీలు బిట్టూను ఉద్దేశించి, 'లొంగిపో, లొంగిపో' అంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత బిట్టూ మీడియాతో మాట్లాడుతూ, 'రాహుల్ చెడిపోయిన పిల్లోడు. రాజీవ్ తీవ్రవాదుల చేతుల్లో హతుడైన కారణంగా ఆయన పిల్లలు అతిపెద్ద దేశభక్తులు అని అనుకుంటారు. నెహ్రూ, గాంధీ కుటుంబం రాజకీయ స్వార్థం కోసం రాజేసిన మంటల్లో నా తాత బియాంత్‌సింగ్ (పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి) ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయాడు. కాంగ్రెస్‌ను వదిలిన ఎందరో నేతలు ఎంపీలయ్యారు. నేను సిక్కు మతస్థుడిని కాబట్టే రాహుల్ నన్ను దూషించారు' అని అన్నారు.

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు రాజ్యసభలో గురువారం ప్రధాని మోదీ జవాబిస్తూ, 'కొందరికి ఇతరుల సొమ్ము దొంగిలించడం కుటుంబ వృత్తి. ఒక కుటుంబం తన పూర్వీకుల అసలు ఇంటిపేరును వాడుకోదు. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే చోరీలు చేయడాన్ని అలవాటుగా మార్చుకున్న కొందరు.. గుజరాతీ అయిన మహాత్మా గాంధీ ఇంటిపేరును దొంగిలించి సొంతం చేసుకున్నారు' అన్నారు. ఇందిరాగాంధీ ఫిరోజ్ గాంధీ కుటుంబం అసలు సిసలు ఫార్సీ ఇంటిపేరు 'ఘాండీ'అయితే, తన కూతురు ఇందిర పెళ్లి సమయంలో నెహ్రూ ఆ ఇంటిపేరును 'గాంధీ'గా మార్చుకోవాలని సలహా ఇచ్చారు. 'ఘాండీ' అనే కుటుంబ నామం ఆయనకు వింతగా కనిపించిందట. మామ గారి మాటను మన్నించిన ఫిరోజ్ తన ఇంటిపేరు స్పెల్లింగ్‌ను 'గాంధీ'గా మార్చుకున్నారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే, ఇంటిపేరును దొంగిలించారని మోదీ పేర్కొనడం మర్యాదలను విస్మరించి మాట్లాడినట్టు కనిపిస్తున్నది.

1980 జులైలో విమాన ప్రమాదంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ రెండో కొడుకు సంజయ్ గాంధీ మరణించాక, ఆయన భార్య మేనక తన భర్తకు రాజకీయ వారసురాలుగా కావాలని కోరుకున్నారు. పెద్ద కొడుకు రాజీవ్‌గాంధీని తన వారసుడిని చేయాలని ఇందిరా నిర్ణయించారు. ఆ తర్వాత పలు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

మేనకను 1982 మార్చి 28 రాత్రి తన అధికార నివాసం నుంచి వెళ్లగొట్టారు. ఆ సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడ గుమిగూడి మేనకను దూషిస్తూ నినాదాలు చేశారు. 'సర్దార్ కీ బేటీ హై గద్దార్ కీ బేటీ హై' (సిక్కు సర్దార్ కూతురు, ద్రోహి బిడ్డ) అంటూ ఆవేశంగా వారు అరిచారు. అంటే, ఇందిర కుటుంబంతో విభేదించినవారు ఎవరైనా ద్రోహులనే నిందను అప్పుడూ, ఇప్పుడూ భరించాల్సిన దుస్థితి కొనసాగుతున్నది.

1984 లోక్‌సభ ఎన్నికల్లో అమేఠీ నుంచి రాజీవ్‌గాంధీపై మేనకా గాంధీ పోటీ చేసినప్పుడు కూడా 'బేటీ సర్దార్ కీ దేశ్ కే గద్దార్ కీ' (సర్దార్ కూతురు దేశ ద్రోహి బిడ్డ) అనే నినాదాలు కాంగ్రెస్ కార్యకర్తలు, నేతల నోట వినిపించాయి. కాంగ్రెస్ బడా నేతల ప్రోత్సాహంతోనే ఇదంతా జరగడం గమనార్హం. మేనక సిక్కులైన అంతేశ్వర్‌కౌర్, తర్‌లోచన్ సింగ్ ఆనంద్ సంతానం.

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఎమర్జెన్సీ కాలంలో (197577) యువరాజుగా, ఉదయిస్తున్న సూర్యుడిగా కాంగ్రెస్ నేతల ప్రశంసలు అందుకున్న ఆమె చిన్న కొడుకు సంజయ్‌కి ఉన్న రాజకీయ చారిత్రక పరిజ్ఞానం అంతంత మాత్రమే. అయినా, ఎమర్జెన్సీని సమర్థిస్తూ వస్తున్న భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ఆయన ఆగ్రహానికి గురైంది. అత్యవసర పరిస్థితి చివరి దశలో కమ్యూనిస్టులపై సంజయ్ విరుచుకుపడ్డారు. 'కమ్యూనిస్టుల సిద్ధాంతం విదేశాల నుంచి వచ్చింది. వారు విదేశాలకు తొత్తులు' అంటూ అనుచితంగా మాట్లాడారు. రాజీవ్ ప్రధాని పదవిలో ఉండగా 198789 మధ్య దేశాన్ని బోఫోర్స్ శతఘ్నుల కుంభకోణం కుదిపివేసింది. ఈ ఆయుధాల కొనుగోలు ఒప్పందంలో స్వీడన్ కంపెనీ బోఫోర్స్ నుంచి రాజీవ్‌కు ముడుపులు ముట్టాయని ఆరోపణలు వెలువెత్తాయి. ఈ ముడుపులు రాజీవ్ సన్నిహితుల స్విస్ బ్యాంక్ ఖాతాలకు బదిలీ అయ్యాయని నిరూపించే డాక్యుమెంట్లను ప్రసిద్ధ ఆంగ్ల దినపత్రిక 'ద హిందూ', ఇంకా ఇతర పత్రికలు ప్రచురించాయి. ముడుపులు తీసుకోవడంలో తన పాత్ర లేదంటూ నాటి ప్రధాని రాజీవ్ పార్లమెంటు సాక్షిగా చెప్పారు. బడా కుంభకోణాలపై ప్రసిద్ధ లాయర్, మాజీ కేంద్ర మంత్రి రామ్ జెఠ్మలానీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో రాజీవ్‌కు రోజూ పది ప్రశ్నలను సంధించేవారు. ఆగ్రహించిన రాజీవ్ ఒక రోజు మీడియాతో మాట్లాడుతూ 'మొరిగే ప్రతి కుక్కకూ నేను జవాబివ్వను' అని అన్నారు. రాజీవ్‌గాంధీ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన జెఠ్మలానీ.. రాజీవ్‌కు లేఖ రాస్తూ 'ప్రియమైన ప్రధానమంత్రీ, నేను మొరిగే కుక్కను మాత్రమే. నేను రక్తం పీల్చే వేటకుక్కను కాకపోవడం వల్ల మీరు అదృష్టవంతులు అయ్యారు. కానీ, దొంగలు కనిపించినప్పుడే కుక్కలు మొరుగుతాయనే విషయం మరవకండి' అని అంతే దూకుడుగా హెచ్చరించారు.

ఇందిరాగాంధీ పాలన చివరి కాలంలో (198084) లో కేంద్రపర్యాటకశాఖ మంత్రి అనంత ప్రసాద్‌శర్మ ఒక రోజు పార్లమెంటులో మాట్లాడుతూ 'కేరళ గొప్ప పర్యాటక కేంద్రం. అక్కడి స్త్రీలు అందంగా ఉంటారు. ముఖ్యంగా రాత్రిపూట మలయాళీ మహిళలు చాలా ఆకర్షణీయంగా, సౌందర్యంతో మెరిసిపోతుంటారు' అన్నారు. అనంత ప్రసాద్‌శర్మ ద్వంద్వార్థాలతో మాట్లాడడం ప్రతిపక్షాల నిరసనకు దారితీసింది. ఒక రాష్ట్రం మహిళల గురించి ఇలా కేంద్రమంత్రి పార్లమెంటులో బరి తెగించి మాట్లాడడం నాటి కాంగ్రెస్ సంస్కృతికి అద్దం పడుతున్నది.దేశంలో కాంగ్రెస్ తర్వాత సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న రెండో జాతీయపక్షంగా బీజేపీ నేతలు కూడా అనేక సందర్భాల్లో చట్టసభల్లో, బయటా తమ రాజకీయ ప్రత్యర్థులను కించపరిచేలా దూషించడం ఆనవాయితీగా మారింది. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తోపాటు కేంద్ర మంత్రి అనురాగ్‌ఠాకూర్, ఝార్ఖండ్‌కు చెందిన బీజేపీ నేత నిశికాంత్ దూబే, ఇంకా బీజేపీ నేతలు తరచుగా ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్షాల నేతలపై అడ్డగోలు వ్యాఖ్యలు చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం పరిపాటిగా మారింది. 2014లో కేంద్రంలో, ఇంకా అత్యధిక రాష్ట్రాల్లో పాలకపక్షంగా అవతరించిన బీజేపీ నేతలు ప్రతిపక్షాల న్యాయబద్ధమైన విమర్శలను సహించలేకపోతున్నారు. విపక్ష నేతలపై నోరు పారేసుకుంటున్నారు. 2022 ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని, 'ఉన్ లోగోంకో ఠోక్ దేంగే' (రాజకీయ శత్రువులను లేపేద్దాంఅనే అర్థంలో) అని సొంత పార్టీ వారితో చెప్పడం జగమెరిగిన సత్యం. కాంగ్రెస్, బీజేపీ పెద్ద నేతలే నోరుపారేసుకుంటారని, ఈ రెండు పెద్ద పార్టీల అగ్రనేతలే ఈ విషయంలో ముందుండి తమ నాయకులు, కార్యకర్తలను నడిపించడం భారత ప్రజాస్వామ్యానికి ఎనలేని నష్టం.



# వాహనదారుల మెడపై కత్తి

ఓడమల్లయ్యను దువ్వి పనిచేయించుకోవాలె. అవతలి గట్టుకు చేరుకున్న తర్వాత బోడమల్లయ్య అంటూ తీసి అవతల పారెయ్యాల నేది కాంగ్రెస్ ఎప్పట్నుంచో అనుసరిస్తున్న నీతి. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి రెండాకులు ఎక్కువే చదివారన్న సంగతి ప్రజలకు ఎప్పుడో అర్థమైపోయింది. అన్నివర్గాలకు అన్నీ అంటూ అందరికీ టోపీలు పెట్టిన సర్కార్ తాజాగా వాహనదారుల మెడపై కత్తిని వేలాడదీస్తున్నది. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ ట్రాఫిక్ ఉల్లంఘనలపై మాట్లాడిన మాటలు ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. పిల్లలు తెలిసో తెల్వకో తాగితే డ్రంక్ డ్రైవ్ అని నోట్లో పుల్ల పెట్టి ఊదిచ్చి, వాని బండి గుంజుకుని, పోలీస్ స్టేషన్ల పెట్టి వాని వీపు పగుల గొట్టి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు.. ఇవీ ఆనాడు రేవంత్ మాటలు. ట్రాఫిక్ ఉల్లంఘనలు పెద్ద నేరమా? అన్నట్టు మాట్లాడి యువతను టార్గెట్ చేసుకుని తెగ సానుభూతి ఒలకబోశారు. ఆటోవాలాలకు చలాన్లు వేసి వారి జేబుల్ని దోచుకోవడం ఏమిటని ఎగిరెగిరి పడ్డారు. తమకు అధికారమిస్తే ఆటోవాలాలకు చలాన్లపై రాయితీ ఇస్తామని ఆశపెట్టారు కూడా. అదంతా నిజమని కొందరు నమ్మారేమో. కానీ ఆ సానుభూతి అంతా ఓట్లు దండుకోవడానికి ఆడిన నాటకమని తేలిపోయింది. ఇప్పుడు జేబులకు కాదు, ఏకంగా ఖాతాలకే చిల్లు పెట్టే ఎత్తుగడకు తెరతీశారు. ఆటోడెబిట్ అనే ప్రమాదకరమైన ఆయుధాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు.మూల మలుపుల్లో మాటువేసి బండ్లను ఆపి, చలానా కట్టమని ట్రాఫిక్ పోలీసులు వేధించడం మనం చూస్తుంటాం. వాహనాల తాళాలు తీసేసుకుని మరీ ఇబ్బంది పెడుతారు. వాహనదారులను రోడ్ల మీద వేధించడం కుదరదని మొన్నకు మొన్న జనవరి 20న హైకోర్టు గట్టిగా హెచ్చరించింది. పౌరులు జరిమానాలను తమ ఎంపిక మేరకు కట్టుకోవచ్చు. పోలీసులు



చట్టబద్ధమైన క్రమాన్ని పాటించితీరాలని స్పష్టం చేసింది. కావాలంటే కోర్టు నోటీసులు పంపాలని సూచించింది. కానీ ఖాతాల నుంచే కట్ చేసుకుంటామని సీఎం రేవంత్ అంటున్నారు. అనడమే కాదు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రాయితీలు కల్పిస్తామని ఇచ్చిన మాటను తప్పి, ఏ వాహనం పైనైనా చలానా వేస్తే పైసా తగ్గించకండి. వాహనం యజమాని బ్యాంకు ఖాతాను ట్రాఫిక్ డిపార్టుమెంటుకు అనుసంధానం చేసి గోళ్లూడకొట్టి వసూలు చేయండి అని అధికారులను ఒత్తిడి చేస్తున్నారు. అధికారులు కూడా ఖాతా వివరాలిస్తేనే వాహన రిజిస్ట్రేషన్ అనే నిబంధనను అమల్లోకి తెచ్చారు. రోడ్డు మీద వాహనాలు ఆపి జరిమానాలు వసూలు చేయవద్దని ఓవైపు హైకోర్టు అంటుంటే ఖాతాకే కన్నం పెట్టాలని చూడటం ఏమిటో!సంపద పెంచడం, ప్రజలకు పంచడం చేతగాక తక్షణం సర్కారు ఆదాయంపెంచుకునేందుకు రేవంత్ నిస్పృహతో ఈ మార్గం ఎంచుకున్నారనేది తెలిసిపోతున్నది. ఆ సంగతి అలా ఉంచితే అసలు 'ఆటో డెబిట్' అనేది ఆచరణ సాధ్యమా అనే చర్చ కూడా నడుస్తున్నది. అత్యవసర పని మీద వెళ్తున్న వ్యక్తి చిన్న ఉల్లంఘనకు పాల్పడితే, అవసరం కోసం పెట్టుకున్న డబ్బు చలానాల కింద ఎగిరిపోతే అతడి పరిస్థితి ఏమిటనేది కీలక ప్రశ్న. ట్రాఫిక్ ఉల్లంఘనల సమస్య అసలు మూలాలను వదిలేసి జరిమానాల పేరిట వసూళ్ల దందా మొదలుపెట్టడం ఏమిటని ప్రజలు మండిపడుతున్నారు. ప్రమాదాలకు, ఉల్లంఘనలకు కేవలం వాహనదారుని బాధ్యుని చేయలేము. వాహనదారుని స్పష్టమైన అనుమతి లేకుండా ఖాతాల నుంచి సొమ్ము లాగేసుకోవడం వల్ల ఇంకా అనేక ఇతర సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి. సైబర్ నేరగాళ్లకు దీనివల్ల అవకాశం కల్పించినట్టు అవుతుంది. ఇప్పటికే ఫేక్ చలాన్ చెల్లింపుల బెడద తలనొప్పిగా మారింది. పైగా బ్యాంకు లింకేజీకి చట్టపరమైన అవరోధాలు చాలానే ఉంటాయన్న సంగతి బహుశా రేవంత్‌కు తెలిసినట్టు లేదు. అవకాశవాద హామీలతో అధికారం చేజిక్కించుకుని నరకం చూపిస్తానంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. ఎవరైనా ఎవరి ఖాతాల్లోనైనా సొమ్ము జమ చేయవచ్చు. కానీ ఇతరులు ఆ ఖాతా నుంచి డబ్బు తీసుకోవడం దాదాపు అసాధ్యం.. అది ప్రభుత్వం అయినప్పటికీ! ఇదివరకటి కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు వివిధ పథకాల కింద సొమ్ము ఖాతాల్లో వేస్తే, ఖాతాల నుంచి సొమ్ము లాగేసుకునేందుకు నడమంత్రపు కాంగ్రెస్ సర్కారు ఎగబడుతుండటం విచారకరం. మోసపోయి గోసపడుతున్న ప్రజ లు కేవలం అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. మిమ్మల్ని గెలిపించిన ఆ ఓట్లతోనే తిరగబడి విరగబోట్లు పొడుస్తారు. తస్మాత్ జాగ్రత్త.


తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్

# మల్లికార్జున స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలి

- **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** మల్లికార్జున స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. బుధవారం గాజులరామారం డివిజన్ నల్లగుట్టపై గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి (చిన్నశ్రీశైలం) దేవాలయంలో శివ గురుస్వామి & ఆలయ ధర్మకర్త దూదిమెట్ల సోమేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇరుముడి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాలధారణ అంటేనే అత్యంత కఠినమని, ఈ దీక్షతో స్వామివారిని 41 రోజుల పాటు శివస్వాములతో పాటు భక్తులందరిపై ఆ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కరుణాకటాక్షాలు సంపూర్ణంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శివ గురుస్వాములు పెంటయ్య, యాది లాల్, సురేష్ రెడ్డి, లవీర్ రెడ్డబోయిన, క్రిష్ణా రెడ్డి, యాదమ్మ, రాజు, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, నాయకులు ఫిరోజ్, ప్రవీణ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



# సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం


- **సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్**

**అక్షర గళం, సైబరాబాద్ :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలలోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను





పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డిసిపి సీ.హెచ్. శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ ఇన్ ఛార్జ్ డిసిపి సాయి మనోహర్, ఎస్బీ డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, డబ్ల్యు అండ్ ఎస్ డబ్ల్యూ డిసిపి సృజన కరణం, పీడీ సెల్ ఏడీసీపీ సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ ఏడీసీపీ పురుషోత్తం, శేరిలింగంపల్లి ఏడీసీపీ ఉదయ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగి రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# ఘనంగా యువ నాయకులు కోల శ్రీకాంత్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** సూరారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కోల శ్రీకాంత్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సూరారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం వారి స్వగృహం నందు నిర్వహించిన పుట్టినరోజు వేడుకలకు హాజరై కోలా శ్రీకాంత్ ముదిరాజ్ తో కేక్ ని కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజాసేవలో మరింత ముందుకు అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు కోల రవీందర్ ముదిరాజ్, గుబ్బల లక్ష్మీనారాయణ, మక్సూద్ అలీ, ఎర్వ సాయికిరణ్ (బంటి), నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ శ్రీ హరి హర క్షేత్రం దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో గండిమైసమ్మ సర్కిల్ లో శ్రీ శ్రీ హరి హర క్షేత్రం దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త , మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని స్వామి వారులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలు సుఖ:సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు .ఈ కార్యక్రమంలో మైసిగారి శ్రీనివాస్,బగిలి మాణిక్ రెడ్డీ, పెద్ద ముత్యం రెడ్డీ, చిన్న ముత్యం రెడ్డీ, సిద్దనోల సంజీవరెడ్డి, కావాలి గణేష్, బైరీ ప్రశాంత్ గౌడ్,పరుశురాం గౌడ్,కృష్ణ మూర్తి, రంగా రావు, బోట్ల విజయ్ కుమార్ , ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# ఓటింగ్ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపాలిటి పరిధిలోని అత్యంత సమస్యాత్మక ,సున్నితమైన పోలింగ్ కేంద్రాలలో లైవ్ వెబ్‌కాస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో నిరంతర సూక్ష్మ పరిశీలించి పర్యవేక్షించారు.

# అనుమతించిన వేళల్లోనే వ్యాపారాలను నిర్వహించుకోవాలి

- **కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి**

**అక్షర గళం, కూకట్ పల్లి :** అనుమతించిన వేళల్లోనే వ్యాపారాలను నిర్వహించుకోవాలని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం షాపులు, వ్యాపార సముదాయ యజమానులతో కేపీహెచ్ బీ పోలీసుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు చట్టబద్ధ నిబంధనలను కచ్చితంగా పాటించేలన్నారు. షాపులు, వ్యాపార సముదాయాల యాజమాన్యాలు తప్పనిసరిగా జీహెచ్ఎంసీ అనుమతి, ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ నమోదు, లేబర్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు.. సమయపరిమితులు పాటించాలన్నారు. దుకాణాల వద్ద అక్రమ కార్యకలాపాలు, జూదానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా భద్రత దృష్ట్యా ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలను కవర్ చేసేలా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.



వ్యాపార అవసరాల కోసం ఫుట్‌పాత్‌లు, రహదారులలను ఇష్టానుసారంగా ఆక్రమించరాదన్నారు. నిబంధనలు పాటించని షాపుల లైసెన్సుల రద్దుకు సంబంధిత శాఖలకు లేఖలు రాస్తామని ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుకాణాలు, వ్యాపార సముదాయ యజమానులు పాల్గొన్నారు.

# అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి11:** అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను



సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతి పెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించిందని రాహుల్ గాంధీ అన్నారు.మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీ పేరు వచ్చినా.. ఎందుకు జైలులో పెట్టలేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యాపారవేత్త అనీల్ అంబానీ ఎందుకు జైలులో లేడని నేను అడగాలనుకుంటున్నాను? దీనికి కారణం ఆయన పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉంది. అతన్ని (అనీల్ అంబానీ) ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసిన హర్‌దీప్ పూరిని కూడా నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. అతన్ని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. హర్దీప్ పూరికి అతన్ని ఎవరు పరిచేశారో తెలుసు' అని అన్నారు. పరోక్షంగా రాహుల్ మోడీనుద్దేశించి వ్యాఖ్యానించారు. బ్జడెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బ్జడెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

# వందేమాతర గీతం ఇక తప్పనిసరి

(మొదటిపేజీ తరువాత)



కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నారు. ఇదిలా ఉంటే.. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు వచ్చాయి. అందులో ఆరు చరణాలను పాడాలని కేంద్రం పేర్కొంది. వాటిని 3 నిమిషాల 10 సెకన్లలో ఆలపించాలి. స్వాతంత్ర్య పోరాట సమయంలో ముస్లింలీగ్ అభ్యంతరాల మేరకు.. ఆరు భాగాల్లోంచి ఎలాంటి మతపరమైన ప్రస్తావనా లేని తొలి రెండింటిని మాత్రమే కాంగ్రెస్ స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వివాదంలేని తొలి రెండు భాగాలతో.. వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.

# మున్సిపోల్స్‌లో రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగం

(మొదటిపేజీ తరువాత)

ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆరఎస్‌కు కొండంత బలాన్నిచ్చింది. పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్యకాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అక్రమంగా లూటీ చేసిన వేలకోట్ల ప్రజాధనంతో ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం



చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసు శాఖను అడ్డంపెట్టుకుని బీఆరఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# కొడంగ్‌లో ఓటేసిన సీఎం రేవంత్



(మొదటిపేజీ తరువాత)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కను వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

# కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

(మొదటిపేజీ తరువాత)

చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ రెడ్డివి ఊకదంపుడు ప్రసంగాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు రేవంత్ భయపడుతున్నారా? కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోరా? అని మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. యూరియా పక్కదారి పడుతున్నా ఏమీపట్టడం లేదా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్‌లో యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించడం తప్ప..



రాష్ట్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు ద్రోహి అంటూ వ్యాఖ్యానించారు. టీవీల ముందు తప్ప.. రైతుల పట్ల బాధ్యత లేదా అని, యూరియా మీద కనీసం సమీక్ష చేయరా అని నిలదీశారు. బీఆరఎస్, కాంగ్రెస్ హయాంలో రైతులు గోసపడారని మంత్రి అన్నారు.



# చెత్తను రోడ్ల పైన వేసే వారిపై చాలాన్ లు వేసి కట్టడి చేయాలి

- **మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ**

**అక్షర గళం, మియాపూర్ :** చెత్తను రోడ్ల పైన వేసే వారిని గుర్తించి జీహెచ్ఎంసీ అప్ ద్వారా పెనాల్టీ చాలాన్ లు వేసి కట్టడి చేయాలని మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ అన్నారు. బుధవారం పారిశుధ్య విభాగం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్కిల్ పరిధిలోని రోడ్లు, కాలనీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేట్లు చూసుకోవాలని, కాలనీల లో పారిశుధ్య పనులు చేయాలని, చెత్తను ఎవరూ బయట వేయకుండ,రోజూ ఆటోకు అందించే విధంగా ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. సర్కిల్ లోని అన్నపూర్ణ క్యాంటిన్ ల పరిసరాలు శుభ్రంగా వుండేట్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. చెత్త ఆటోలు ఎప్పటికప్పుడు చెత్తను ఇండ్ల నుండి,వాణిజ్య సముదాయాల తీసుకువెలుతున్నరా లేదా రోజూ తనిఖీలు నిర్వహించాలనిఆదేశించారు. ప్రతి షాప్ ల,అపార్ట్మెంట్ లు, స్ట్రీట్ వేండర్స్, కార్యాలయాలు,ప్రార్థనా మందిరాలు మొదలైన వారు తప్పనిసరిగా రెండు డస్ట్ బిన్ పెట్టుకునే విధంగా చూసుకోవాలని,ఆటోకు చెత్తను అందించే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశం లో సర్కిల్ పారిశుధ్య అధికారి వశీధర్,నిఖిల్,శ్రీనివాస్, జవాన్ లు, ఎస్ఆర్పీ లు,ఎస్ఎఫ్ఎ లు,రాంకీ సిబ్బంది పాల్గొన్నారు.







## ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

ఆమనగల్లు మున్సిపాలిటీకి బుధవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులలో 84.74% ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ శంకర్ తెలిపారు. మున్సిపాలిటీలోని 16,984 ఓట్లకు గాను 14,392 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. ఓటింగ్ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్స్ లను స్థానిక పాఠశాలలో భద్రపరిచేందుకు భారీ బందోబస్తు మధ్య తరలించారు.

- ఆమనగల్లు, ఫిబ్రవరి11 (అక్షర గళం):







## పోలింగ్ బూతులలో జరుగుతున్న పోలీంగ్ ప్రక్రియను ను పరిశీలించిన

**ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీ**

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి :** మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీ లలోని పోలింగ్ బూతులలో జరుగుతున్న పోలీంగ్ ప్రక్రియను ను సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీ తో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. బుధవారం ఉదయం మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఆలియాబాదులోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో, మూడుచింతలపల్లి లోని జగ్గన్ గూడ లో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లో, ఎల్లంపేట్ మున్సిపాలిటిలోని రాజబొల్లారంలో గల ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులలో నిర్వహిస్తున్న ఓటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ లు తనిఖీ చేసారు. బూతులలో పోలింగ్ విధానాన్ని పరిశీలించి ఇప్పటివరకు ఎంత మంది ఓటు వేసారని ప్రిసైడింగ్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూతులలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసారా అని, వీల్ ఛైర్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటు వేయడానికి వీల్ ఛైర్ లో వచ్చిన వృద్ధురాలితో మీ పేరు ఏమిటి, ఎంత వయసు అని కలెక్టర్ అడుగగా, తన పేరు కిష్టమ్మ, తన వయసు 65 సంవత్సరాలని ఓటు వేయడానికి వచ్చానని ఆనందంగా తెలియజేసింది.

## అక్కా చెల్లెళ్లు క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :** తండ్రి మందలించాడనే కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిన అక్కా చెల్లెళ్లు (21), (14) జీడిమెట్ల పోలీసులు క్షేమంగా గుర్తించి వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.జీడిమెట్ల ఇన్ స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇద్దరు అమ్మాయిలు ఇంటి నుంచి వెళ్లిపోయారని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో ఆర్టీసీ బస్సుల వివరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. విజయవాడ సమీపంలో వీరి ఆచూకీని గుర్తించి వారిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను క్షేమంగా తిరిగి ఇంటికి చేర్చినందుకు జీడిమెట్ల పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# 12న సమ్మెను విజయవంతం చేయాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 11 (అక్షర గళం):** లేబర్ కోడ్స్, విబి రామ్ జి చట్టం, జాతీయ విత్తన విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని, 1996 కేంద్ర చట్టం రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణ కేంద్రంలోని బాపూజీ తాపీ మేస్త్రిల సంఘం భవనంలో మండల గౌరవ అధ్యక్షులు గంగిశెట్టి సురేందర్, ముఖ్య సలహాదారి ముక్కరి కృష్ణయ్య లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమ్మె కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు సుంకర రామ్మోహన్ రావు హాజరవుతారని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ను రద్దు చేయాలి, విబిజి రామ్ జి బిల్లును రద్దు చేసి, నరేగా పథకాన్ని యదావిధంగా కొనసాగించాలి విత్తన, విద్యుత్ చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలి, ఇన్సూరెన్స్ రంగంలో 100% విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలి, భవన నిర్మాణ కేంద్ర చట్టం1996, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం1979 లను కాంట్రాక్ట్ కార్మికుల చట్టం1970 లను పకడ్బందీగా అమలు చేయాలి, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి, కార్మిక సంఘాల ప్రతినిధులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలి,ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానుకలను రూ.లక్షకు పెంచాలి. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి, కేంద్ర చట్టంలోని స్కాలర్షిప్లు, గృహవసతి, అడ్డాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి 2009లో నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు వెంటనే రెన్యువల్ చేయాలి ఈశ్రమ్ గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులందరికీ అందజేయాలి కార్మికులకు అవసరం లేని సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి, 96 కేంద్ర చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్ల నిధులను తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు.





## ట్రాక్టర్ ఆటో ఢీకొని ఇద్దరు శివ స్వాములు మృతి

**వెల్దండ ఫిబ్రవరి 11 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని కోట్ర గేట్ సమీపంలో కల్వకుర్తి హైదరాబాద్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు శివ స్వాములు మృతి చెందారు హైదరాబాదు నుండి శ్రీశైలం వెళుతున్న ఆటో కల్వకుర్తి నుండి వెల్దండ వైపు వస్తున్న ట్రాక్టర్ ఆటో ఢీకొన్నాయి ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు శివ స్వాములు వనపర్తి జిల్లా పాన్ గల్ మండలం తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన కేతావత్ సురేష్ వికారాబాద్ జిల్లా బొమ్మ రాజ్ పేట మండలం ఎరుపు మళ్ళ గ్రామానికి చెందిన కడ మంచి సత్యనారాయణ లు మృతి చెందారు ఎస్సై కురుమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.






# కల్వకుర్తి మున్సిపాలిటీలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- భారీగా నమోదైన 80.80% నమోదు
- పోలింగ్ సరళిని పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రాం సింగ్ జి పాటిల్
- ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్
- ఎన్నికలు ప్రశాంతం
- ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్

**కల్వకుర్తి ఫిబ్రవరి 11 (అక్షర గళం ):** కల్వకృతి పురపాలక సంఘం ఎన్నికలు ముగిసాయి బుధవారం జరిగిన పురపాలిక 22 వార్డులలో మొత్తం ఓటర్లు 21027 ఓటర్లు ఉండగ10444 మహిళా ఓటర్లు 10583 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు మొత్తం ఓటర్లు 26023 కాగా ఓటు హక్కును వినియోగించుకున్న వారు21027 తో80.80% భారీగా నమోదయింది ఉదయం నుండి ఓటర్లు తమ ఓటు హక్కును లైన్లో నిలబడి వినియోగించుకున్నారు పుర సంగం ఆధ్వర్యంలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల పోలింగ్ సరళిని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రాం జి పాటిల్ పరిశీలించి పోలింగ్ కేంద్రాల వద్ద తగు సూచనలు పోలీస్ సిబ్బందికి జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్త్ మధ్య కల్వకుర్తి డిఎస్పి ఎన్నికలను పర్యవేక్షించి ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడం పట్ల రాజకీయ పార్టీలకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు ఎన్నికల ముగిసిన అనంతరం పటిష్ట పోలీస్ బందోబస్త్ వద్ద ఆయా పోలింగ్ స్టేషన్లోని బ్యాలెట్ బాక్సులను కల్వకుర్తి పట్టణంలోని బీఈడీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచారు. ఈనెల 13న ఎన్నికల కౌంటింగ్ ఉంటుంది.









## వాట్సాప్ లో సీఎం ను దూషిస్తూ వీడియోలు పోస్ట్ చేసిన వ్యక్తి అరెస్ట్

**వెల్దండ ఫిబ్రవరి 11 (అక్షర గళం):** ఈ నెల 9న వాట్సప్ గ్రూపులలో తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని ఉద్దేశిస్తూ ఒక వ్యక్తి అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ వీడియోలను పోస్ట్ చేసిన వ్యక్తి నీ అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ....వాట్సాప్ లో సీఎం ను దూషిస్తూ వీడియోలు పోస్ట్ చేసిన వ్యక్తి అరెస్ట్ చేసి బుధవారం కల్వకుర్తి కోర్టు లో హాజరుపరచగా అతనికి 14 రోజుల రిమాండ్ విధించడం జరిగింది. ఎవరైనా ఎదుటి వ్యక్తులను అవమానపరిచే విధంగా గాని కించపరిచే విధంగా గాని వీడియోలను గాని లేదా పోస్టులను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లయితే అట్టి వ్యక్తుల పైన కేసులు నమోదు చేసి, జైలుకు పంపనున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

## ఆకాశ ఎయిర్‌లైన్స్ సహ వ్యవస్థాపకుడు ప్రవీణ్ అయ్యర్ రాజీనామా





ఆకాశ ఎయిర్‌లైన్స్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు ఐదేళ్లుగా ఆకాశ ఎయిర్‌లో కొనసాగుతున్న ఆయన కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భాగంగా వైదొలుగుతున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. అధికారాలు, బాధ్యతలు సక్రమంగా బదిలీ జరిగేందుకు ఏప్రిల్ 30 వరకు ఆయన తన పదవిలో కొనసాగుతారని పేర్కొంది. ఆకాశ ఎయిర్ నుంచి ఉన్నత స్థాయి వ్యక్తులు వైదొలగడం ఇటీవల కాలంలో ఇది రెండోది. మరో సహ వ్యవస్థాపకురాలు నీలు ఖత్రి గతేడాది అక్టోబర్‌లో రాజీనామా చేశారు.
2022 ఆగస్టు 7న ఆకాశ ఎయిర్‌లైన్స్ ప్రారంభమైంది. సంస్థ వ్యవస్థాపకుడు వినయ్ దుబె సీఈఓగా వ్యవహరిస్తున్నారు. అయ్యర్ రాజీనామాతో ప్రస్తుతం నలుగురు సహ వ్యవస్థాపకులు మిగిలారు. ఆకాశ ఎయిర్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల్లో ఒకరైన అయ్యర్ వైదొలగడంతో.. చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా ఉన్న ఆదిత్య చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పదవికి అర్హులైన అభ్యర్థుల కోసం ఆకాశ ఎయిర్ అన్వేషణ మొదలుపెట్టింది.
ఆకాశ ఎయిర్‌లైన్స్ నిర్మాణంలో అయ్యర్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా సీఈఓ వినయ్ దుబె పేర్కొన్నారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం 33 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలను నడుపుతోంది. 202425 ఆర్థిక సంవత్సరానికి విమానయాన సంస్థలు మొత్తంగా కలిపి రూ.5,289.73 కోట్ల నష్టాన్ని ప్రకటించగా.. ఆకాశ ఎయిర్‌కు రూ.1986.25 కోట్ల నష్టం వచ్చినట్లు కేంద్రం ఇటీవల రాజ్యసభకు తెలిపింది. అలాగే, గడిచిన రెండేళ్లలో విమానయాన సంస్థలకు 352 షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. అందులో 17 ఆకాశ ఎయిర్ అందుకుంది.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. భారత్‌అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కారణంగా మూడు రోజుల పాటు వరుస లాభాలు చవిచూసిన సూచీలు.. నేడు మోస్తరు శ్రేణిలోనే కదలాడాయి. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాల వల్ల సూచీలపై ఒత్తిడి పడింది. సెన్సెక్స్ ఉదయం 84,339.15 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,273.92) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,081.25 84,487.34 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 40.28 పాయింట్ల నష్టంతో 84,233.64 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18.70 పాయింట్ల లాభంతో 25,953.85 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటెర్నెల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎస్‌బీఐ, మారుతీ సుజుకీ, ఇండిగో, ట్రెంట్, రిలయన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69.71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5070 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## శాంసంగ్ అన్‌ప్యాక్డ్ ఈవెంట్ తేదీ ఖరారు..




దక్షిణ కొరియాకు చెంది ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ శాంసంగ్ మెగా ఈవెంట్‌కు సిద్ధమైంది. గెలాక్సీ అన్‌ప్యాక్డ్ 2026 పేరిట ఏటా నిర్వహించే ఈవెంట్ తేదీని ఖరారు చేసింది. ఫిబ్రవరి 25న నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ ఈవెంట్‌లో ఎస్26 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించనుంది. ప్రీ రిజర్వేషన్లను కూడా ప్రారంభించింది.
ఫిబ్రవరి 25న శాన్‌ఫ్రాన్సిస్కోలో గెలాక్సీ అన్‌ప్యాక్డ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. అంటే భారత్ కాలమానం ప్రకారం రాత్రి 11.30 గంటలకు ఈవెంట్ మొదలవుతుంది. శాంసంగ్.కామ్, శాంసంగ్ న్యూస్‌రూమ్, యూట్యూబ్ ఛానెళ్లలో ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించొచ్చు. రూ.999 చెల్లించి గెలాక్సీ ప్రీ రిజర్వ్ వీఐపీ పాస్ తీసుకుంటే కొత్త గెలాక్సీ ఫోన్ల కొనుగోలు సమయంలో రూ.5 వేలు విలువైన ఈస్టోర్ వోచర్‌ను పొందొచ్చు. ఇక స్మార్ట్‌ఫోన్ల విషయానికొస్తే.. ఎస్26 సిరీస్‌లో మొత్తం మూడు ఫోన్లు రాబోతున్నాయి. శాంసంగ్ గెలాక్సీ ఎస్26, ఎస్26+, ఎస్ 26 అల్ట్రా పేరిట వీటిని తీసుకువస్తున్నారు. 'తదుపరి తరం ఫోన్లతో మీ రోజువారీ జీవితం సులభతరం కానుంది' అని శాంసంగ్ తన ప్రకటనలో పేర్కొంది. దీనిబట్టి ఎస్26 సిరీస్ ఫోన్లలో ఏఐ ఫీచర్లపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. స్మార్ట్‌ఫోన్లతో పాటు శాంసంగ్ బడ్స్ 4, గెలాక్సీ బడ్స్ 4 ప్రో మోడళ్లను కూడా ఆవిష్కరించినట్లు తెలుస్తోంది.

## ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఇక ఎల్‌టీఎం లిమిటెడ్




**దిల్లీ:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ పేరు మారింది. ఇకపై ఎల్‌టీఎం లిమిటెడ్‌గా వ్యవహరించనున్నారు. ఎల్అండ్‌టీ ఇన్ఫోటెక్, మైండ్‌ట్రీ విలీనం తర్వాత ఎల్‌టీఐమైండ్‌ట్రీ అవతరించిన సంగతి తెలిసిందే. తదుపరి దశ వృద్ధికి సంసిద్ధతను తెలియజేసేలా ఈ మార్పు చేసినట్లు ఎల్అండ్‌టీ గ్రూప్ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. "నేటి నుంచి మా బ్రాండ్ పేరు ఎల్‌టీఐమైండ్‌ట్రీ నుంచి కి మారుతోంది. విలీనం తర్వాత అనేక సంవత్సరాలుగా ఒకే కంపెనీగా విజయవతంగా పనిచేస్తూ ప్రపంచ శక్తి కేంద్రంగా అవతరించాం. మా ఆకాంక్షలను, మా వ్యూహాత్మక ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉండేందుకు రిఫ్రెష్డ్ గుర్తింపులో భాగంగా ఈ మార్పు చేపట్టాం" అని కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ వేణు లంబు వాటాదారులనుద్దేశించి మాట్లాడారు. ఎల్అండ్‌టీ ఇన్ఫోటెక్, మైండ్‌ట్రీ 2022లో విలీనం అయ్యాయి. ప్రస్తుతం ఈ సంస్థ 40 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 87 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

# రాహుల్ ఆరోపణలపై కేంద్రమంత్రి క్లారిటీ



కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన 'ఎప్స్టీన్' ఆరోపణలను కేంద్రమంత్రి హర్దీప్సింగ్ పురీ తీవ్రంగా ఖండించారు. ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ బృందంలో భాగంగా తాను ఎప్స్టీన్ను కలిశానని చెప్పారు. "ఐపీఐలో మా బాస్కు ఎప్స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో మాత్రమే సమావేశమయ్యాను. కచ్చితంగా చెప్పాలంటే మూడునాలుగు సార్లు. ఒక్కసారి మాత్రమే ఈమెయిల్ చేసుకున్నాం. అతడిపై వచ్చిన ఆరోపణలకు మా మధ్య జరిగిన సంభాషణకు ఎలాంటి సంబంధం లేదు" అని వెల్లడించారు. ఇదంతా అసత్య ప్రచారమంటూ రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. బడ్జెట్పై ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఎప్స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. అప్పుడు అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్ సింగ్ పేర్లను ప్రస్తావించారు. "ఈ రోజు విపక్ష నేత పార్లమెంట్లో కొన్ని విషయాలు మాట్లాడారు. ఆయనకు నిరాధార ఆరోపణలు చేయడం అలవాటు. మన రాజకీయ వ్యవస్థలో రెండురకాల నేతలు ఉంటారు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ.. సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేస్తుంటారు. మరికొందరు అప్పుడప్పుడు దేశానికి వస్తారు. వారికి పార్లమెంట్లో తగిన సమాధానం ఇచ్చినప్పుడు వినకుండా సభ నుంచి వాకౌట్ చేస్తుంటారు" అని రాహుల్ తీరును విమర్శించారు.
అమెరికా ప్రభుత్వం ఇటీవల 30 లక్షల 'ఎప్స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. ప్రజా సంఘాలు, రాజకీయంగా వచ్చిన ఒత్తిడి కారణంగా రూపొందించిన ఎప్స్టీన్ ఫైల్స్ ట్రాన్స్పరెన్సీ యాక్ట్ కింద వీటిని విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులతో సంబంధాలు నెరిపిన ఎప్స్టీన్ 2019లో న్యూయార్క్ జైల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మైనర్ బాలికలను అక్రమరవాణా చేశాడన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొన్నాడు. అతడి మాజీ గర్ల్ఫ్రెండ్ గిస్లైన్ మ్యాక్స్వెల్కు 2021లో 20 ఏళ్ల జైలు శిక్షపడింది

# టెండర్లపై 'ఏఐ' నిఘా.. అక్రమాలు, సిండికేట్‌లు ఇకపై కుదరవు!



రహదారులు, రైల్వే ప్రాజెక్టులు సహా అభివృద్ధి పనులు.. ఇలా ప్రభుత్వంలో ప్రధాన నిర్మాణ ప్రాజెక్టులకు టెండర్లు తప్పనిసరి. అయితే, ఇక్కడే అవినీతికి తావు ఏర్పడుతుంది. నిర్దేశించిన దానికంటే కాంట్రాక్టర్లు ఎక్కువకు కోట్ చేయడమో, వాళ్లు రింగ్ కావడమో జరుగుతుంటుంది. ఫలితంగా నాణ్యత లేని పనులు జరుగుతుంటాయి.
ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు చైనా ఏకంగా కృత్రిమ మేధను రంగంలోకి దించింది. టెండర్ల ప్రక్రియలో వీటి వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలను ఇటీవల విడుదల చేసింది. హిందువుల్లో ఆందోళనల వేళ.. ఎన్నికలకు సిద్ధమైన బంగ్లాదేశ్ టెండర్ల ప్రక్రియ అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ప్రభుత్వ వర్గాలను ఏఐ టూల్స్ అలర్ట్ చేస్తాయి. సాధారణంగా టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ అధికారులు పరిశీలిస్తారు. వీరు ఎంత క్షుణ్నంగా అధ్యయనం చేసినా.. అక్రమార్కులు వీరిని బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ ఏఐ టూల్స్ మాత్రం ఇలాంటి వాటిని పసిగట్టేస్తాయి.
ప్రత్యేకించి డొల్ల కంపెనీలు, బిడ్డింగ్‌లో అనుచిత ధోరణులు అవలంభించడం.. తదితర వాటిని గుర్తిస్తాయి. టెండర్లకు సంబంధించి ఉన్న మొత్తం సమాచారాన్ని, కాంట్రాక్టర్ల వివరాలను ఏఐ టూల్స్‌కు అధికార వర్గాలు అందిస్తాయి. దీంతో ఎక్కడ అక్రమాలు జరిగినా అవి అలర్ట్ చేస్తాయి. ప్రాథమికంగా టెండర్ స్థాయిలోనే అక్రమాలకు తెరలేస్తుంది. దీంతో ఇక్కడే గుర్తిస్తే అనేక అవకతవకలను నివారించవచ్చన్నది అధికారుల ఆలోచన. ఝెన్‌జియంగ్ రాష్ట్రంలో జరిగిన కొన్ని అక్రమాలను ఏఐ ఇప్పటికే కనిపెట్టడంతో కుంభకోణ బాధ్యులపై చర్యలు తీసుకున్నారు.
దేశవ్యాప్తంగా ఏటా కొన్ని వేల కోట్ల విలువైన పనులకు లక్షల్లో టెండర్లు వస్తుంటాయి. వీటిని నిశితంగా పరిశీలించడం కష్టసాధ్యం. దీంతో ఏఐ సహాయం తీసుకునేందుకు చైనా అధికారులు సిద్ధమయ్యారు.
చైనాలో అవినీతిని అక్కడి ప్రభుత్వం ఉపేక్షించదు. ఏ స్థాయిలో అవినీతి ఉన్నా బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటుంది. ఇటీవల అనేక మంది అవినీతి అధికారులకు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే.

## డిజిటల్ సేవల పన్నులు ఇక ఉండవా?

ఇటీవల కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం కింద డిజిటల్ సేవల పన్ను (డీఎస్‌టీ)ను భారత్ తొలగిస్తుందని అమెరికా ప్రకటించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన వారం రోజుల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. మన ప్రభుత్వ అధికారిక ప్రకటనలో మాత్రం ఈ విషయం లేదు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ సేవల పన్నును మనదేశం ఎలా విధించింది, ఇప్పుడు ఏ మేరకు ఉపసంహరించుకుంటుంది అనే అంశాలను చూస్తే.. వాణిజ్య ఒప్పందంపై ఫ్యాక్ట్ షీట్‌ను అమెరికా విడుదల చేసింది. డిజిటల్ సేవల పన్నులను భారత్ తొలగిస్తుందని అందులో పేర్కొంది. వివక్షపూరిత, భారమైన పన్నులను భారత్ తొలగించేలా చూసేందుకు చర్చలు జరుపుతున్నట్లూ వెల్లడించింది. ఎలక్ట్రానిక్స్ ట్రాన్స్‌మిషన్స్‌పై కస్టమ్స్ సుంకాలు విధించడాన్ని నిషేధించే నిబంధనలు కూడా ఉన్నాయి. వాణిజ్య ఒప్పందంపై భారత అధికార ప్రకటనలో డిజిటల్ సేవల పన్ను తొలగింపు గురించి స్పష్టంగా ప్రస్తావించలేదు. మనదేశం ఇప్పటికే ఈక్వలైజేషన్ పన్నులను రద్దు చేసింది. 'డిజిటల్ సేవలు అందించడం ద్వారా ఒక దేశ వినియోగదారుల నుంచి విదేశీ కంపెనీలు ఆర్జించే ఆదాయంపై విధించే పన్నే' డిజిటల్ సేవల పన్ను. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా దేశీయ పన్ను విధానాలను తీసుకురావడం, ప్రధాన దేశాలతో వాణిజ్య ఒత్తిళ్లను తగ్గించుకునే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

# గుట్టు చప్పుడు కాకుండా ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు..!



భారత్‌అమెరికా మధ్య ట్రేడ్ డీల్ ఖరారైన సంగతి తెలిసిందే మార్చిలో దీనిపై తుది సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో కీలక అంశాలతో కూడిన ఫ్యాక్ట్ షీట్‌ను ఇటీవల శ్వేతసౌధం విడుదల చేసింది. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే దానిలో ఇబ్బందికర అంశాల్లో మార్పులు చేసింది. భారత ప్రభుత్వం కొన్ని పప్పుధాన్యాలపై సుంకాలను తగ్గిస్తుందంటూ తొలుత పేర్కొన్న అగ్రరాజ్యం తర్వాత ఆ లైన్‌ను ఉపసంహరించుకుంది. అలాగే 500 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తుల కొనుగోళ్లకు భారత్ 'కట్టుబడి ఉంది' అన్న పదాన్ని 'కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఉంది' అన్నట్లు మార్పు చేసింది. మన దేశానికి అగ్రరాజ్యం ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు భారత్ తొలి నుంచి అంగీకరించడం లేదు. అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల భారత రైతులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎటువంటి నష్టం ఉండదని ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖమంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫ్యాక్ట్‌షీట్‌లో సవరణలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి ఫ్యాక్ట్‌షీట్‌ను సోమవారం శ్వేతసౌధం విడుదల చేసింది. కానీ, 24 గంటల్లోనే దానిలో మార్పులు చేయడం విశేషం. కొన్ని పదాలు, నిబంధనల విషయంలో అమెరికా వెనక్కి తగ్గినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం నుంచి కూడా కొంత ఒత్తిడి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. తాజాగా చేసిన మార్పుల్లో పప్పు దినుసులపై టారిఫ్‌ల అంశం అత్యంత కీలకమైంది. భారత్‌కు సంబంధించి వ్యవసాయోత్పత్తుల అంశం చాలా ముఖ్యమైంది.

# ఏఐ ప్లాన్‌కు సిద్ధంగా లేకపోతే.. స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చు: గూగుల్ ఆఫర్




కృత్రిమ మేధ అన్ని రంగాల్లోనూ శరవేగంగా విస్తరిస్తోంది. దానిని అందిపుచ్చుకునే క్రమంలో పలు సంస్థలు సిబ్బంది సంఖ్యలో కోతపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ తన ఉద్యోగులకు ఒక అవకాశం ఇచ్చింది. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేనివారు.. స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయొచ్చని సూచించింది. వారికి స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీని ఆఫర్‌చేసింది. ఈ మేరకు గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్‌ను ప్రస్తావిస్తూ బిజినెస్ ఇన్‌సైడర్ కథనం పేర్కొంది. గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ (GBO)లోని కొందరు ఉద్యోగులకు ఈ ప్యాకేజీ వర్తించనుంది. గూగుల్‌లోని ఈ జీబీఓ యూనిట్.. సంస్థ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన ప్రకటనలు, గ్లోబల్ రెవెన్యూ గ్రోత్ (ప్రపంచవ్యాప్తంగా కంపెనీ ఆదాయం, అమ్మకాలు)ను పర్యవేక్షిస్తోంది.
2025 ఏడాదికి గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఆదాయం 400 బిలియన్ డాలర్లు. 2026ను మెరుగ్గానే ఆరంభించినప్పటికీ.. ఏఐ పరిధి విస్తృతం అవుతోందని, దానిని అందిపుచ్చుకునేవారినే సంస్థ కోరుకుంటోందని షిండ్లర్ పేర్కొన్నారు. అమెరికాలోని కస్టమర్ సేల్స్ టీమ్స్, కస్టమర్ ఫేసింగ్ పొజిషన్స్ (నేరుగా కస్టమర్లతో సంప్రదింపులు జరిపే)కు ఈ ప్యాకేజీ వర్తించదని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛంద నిష్క్రమణ అనేది గూగుల్ కే పరిమితం కాలేదు. ఇతర టెక్ సంస్థలు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ ఇలాంటి ప్యాకేజీలను ప్రవేశపెట్టాయి. మైక్రోసాఫ్ట్ తన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు అల్టిమేటం ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి. ఏఐ కార్యక్రమాలను విస్తృతం చేసే లక్ష్యంతో ముందుకువెళ్తోన్న గూగుల్‌కు మార్కెట్‌లో భారీ మద్దతు లభించింది. నిధుల సమీకరణ కోసం అల్ఫాబెట్ జారీ చేసిన బాండ్లు మార్కెట్లో అదరగొట్టాయి. దాంతో సంస్థ 24గంటల్లో రూ.2.9 లక్షల కోట్లను సమీకరించింది.

# ఉత్కంఠ మధ్య సౌతాఫ్రికా విజయం



ప్రపంచం ఫిబ్రవరి 11, 2026ని గుర్తుంచుకుంటుంది. బుధవారం జరిగి మ్యాచ్‌లో అన్ని ఉత్కంఠభరితమైన పరిమితులను దాటింది. ఒకే మ్యాచ్‌లో రెండు సూపర్ ఓవర్లు. దీనిని టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత ఉత్కంఠభరితమైన పోటీ అని పిలవడం తప్పు కాదు. కొన్నిసార్లు ఆఫ్ఘనిస్తాన్ గెలుస్తుందని అనిపించింది. కొన్నిసార్లు దక్షిణాఫ్రికా తిరిగి పోరాడుతుంది. మ్యాచ్ ప్రతి క్షణం మారుతూనే ఉంది. కొన్నిసార్లు ఎవరైనా ఫ్రీ హిట్‌పై రనౌట్ అవుతారు, కొన్నిసార్లు సైరన్ మోగుతుంది. రెండు సూపర్ ఓవర్లు చివరి బంతికి వికెట్ , సిక్స్‌తో ముగిశాయి. చివరికి, దక్షిణాఫ్రికా గెలిచింది, ఆఫ్ఘన్ ఆటగాళ్లకు నిరాశ తప్ప మరేమీ మిగిల్చలేదు. టీ20 వరల్డ్ కప్‌లో బుధవారం సూపర్ మ్యాచ్ జరిగింది. బంతి బంతికి సస్పెన్స్‌తో మ్యాచ్ వావ్ అనిపించింది. మట్నుదట మ్యాచ్ టై. ఆ తర్వాత సూపర్ ఓవర్ కూడా టై. మరో సూపర్ ఓవర్ లాస్ట్ బాల్ వరకూ టై వైపే వెళ్లింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గ్రూప్ డీ ప్రత్యర్థి దక్షిణాఫ్రికాతో ఆఫ్ఘనిస్థాన్ పోటీ పడింది. టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్తాన్ దక్షిణాఫ్రికాపై బౌలింగ్ వేసి.. 6 వికెట్లకు 187 పరుగులకే పరిమితం చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ 19.4 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్తాన్ 17 పరుగులు చేసింది. అయితే దక్షిణాఫ్రికా ఆ స్కోరును సమం చేసింది. దాంతో మ్యాచ్‌ను మరో సూపర్ ఓవర్ వచ్చింది. రెండవ సూపర్ ఓవర్‌లో దక్షిణాఫ్రికా 24 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది, కానీ ఆఫ్ఘనిస్తాన్ ఆలౌట్ అయింది. ఆఫ్ఘనిస్తాన్ తన తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది. ప్రోటీస్ కెనడాపై విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆస్ట్రేలియా ఈ రోజు జరిగే రెండవ మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో తలపడుతుంది. ఇంగ్లాండ్ చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో తలపడుతుంది.

దక్షిణాఫ్రికా ప్లేయింగ్ 11 ఐడెన్ మార్క్రామ్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్), ర్యాన్ రికెల్టన్, డెవాల్డ్ బ్రూవిస్, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో జాన్సన్, జార్జ్ లిండే (కార్బిన్ బాష్ స్థానంలో), కగిసో రబాడ, కేశవ్ మహారాజ్ మరియు లుంగి న్గిడి.

ఆఫ్ఘనిస్తాన్ ప్లేయింగ్ ఎలెవన్ రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, గుల్బాదిన్ నైబ్, సిదిఖుల్లా అటల్, దర్వేష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్ (కెప్టెన్), ఫజల్హక్ ఫరూఖీ, నూర్ అహ్మద్ మరియు ముహమ్మద్ రెహమాన్.

# రెండో మ్యాచ్‌కు టీమిండియా సిద్ధం

**టీమిండియా ముమ్మరంగా సాధన**
**నేడు నమీబియాతో అమీతుమీ**
**గ్రూప్-ఏలో ఢిల్లీ వేదికగా మ్యాచ్**
**సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి..**
**అభిషేక్ శర్మకు విశ్రాంతినిచ్చే చాన్స్**



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని ఘనంగా ప్రారంభించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. గ్రూప్‌ఏలో భాగంగా ఢిల్లీ వేదికగా జరిగే మ్యాచ్‌లో నమీబియాతో అమీతుమీ తేల్చుకోనుంది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో అతి కష్టం మీద గెలిచిన టీమిండియా.. ఈ మ్యాచ్‌లో దుమ్ము రేపాలని భావిస్తోంది. ఆదివారమే ఢిల్లీకి చేరుకున్న టీమిండియా ముమ్మరంగా సాధన చేస్తోంది.అయితే ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్ ఆడటం సందేహంగా మారింది. ప్రస్తుతం అతను ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. అమెరికాతో మ్యాచ్‌లోనూ ఇదే సమస్యతో బ్యాటింగ్ చేసిన అభిషేక్ శర్మ ఫీల్డింగ్‌కు రాలేదు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో కనిపించలేదు. అభిషేక్ శర్మ ఉదర సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నాడని బ్యాటింగ్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే మీడియాకు తెలిపాడు. మ్యాచ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉందని, ఆ సమయానికి కోలుకుంటాడని ఆశిస్తున్నామని చెప్పాడు. మరోవైపు సంజూ శాంసన్ నెట్‌స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్‌తో కలిసి బ్యాటింగ్ సాధన చేశాడు. ఈ క్రమంలోనే నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా నమీబియాతో మ్యాచ్ నుంచి అభిషేక్ శర్మకు విశ్రాంతి కల్పించనున్నారు.న్యూజిలాండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమై తుది జట్టులో చోటు కోల్పోయిన సంజూ శాంసన్‌కు ఇది సువర్ణవకాశం. ఈ మ్యాచ్‌లో అతను భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగితే.. తుది జట్టులో కొనసాగుతాడు. ఓపెనర్లు ఇద్దరూ లెఫ్టార్మ్ బ్యాటర్లే అయిన నేపథ్యంలో సంజూ శాంసన్ ఫామ్‌లోకి వస్తే అతనికి ప్రాధాన్యత లభిస్తోంది.తీవ్ర జ్వరంతో అమెరికాతో మ్యాచ్‌కు దూరమైన జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అదే జరిగే మహమ్మద్ సిరాజ్‌పై వేటు పడనుంది. అమెరికాతో మ్యాచ్‌లో సిరాజ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. అయినప్పటికీ బుమ్రా రీఎంట్రీతో అతను బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తో బరిలోకి దిగితే అర్ష్‌దీప్ సింగ్ కూడా బెంచ్‌కే పరిమితమవుతాడు. అతని స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడుతాడు.మిగతా కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది.

నమీబియాతో తలపడే భారత తుది జట్టు(అంచనా) ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ/సంజూ శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్/కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా/మహమ్మద్ సిరాజ్, వరుణ్ చక్రవర్తీ.

# అభిషేక్ శర్మకు అనారోగ్యం!!



ఫిబ్రవరి 12న జరిగే టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్, నమీబియా ఆడనున్నాయి. ఈ మ్యాచ్‌కు సన్నద్ధమవుతున్న టైంలో ఓపెనర్ అభిషేక్ శర్మ అనారోగ్యానికి గురయ్యాడనే వార్త అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. భారత జట్టు తదుపరి మ్యాచ్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతుంది, అక్కడ మంగళవారం ఆటగాళ్లు ప్రాక్టీస్ చేశారు. అయితే, అభిషేక్ శర్మ ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదు. మంగళవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో టీం ఇండియా ఆటగాళ్లు చాలా మంది పాల్గొన్నారు. గాయం నుంచి కోలుకున్న ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా ఢిల్లీలో జట్టుతో చేరాడు. సుందర్ కూడా ప్రాక్టీస్ చేస్తున్నట్లు కనిపించాడు. అభిషేక్ శర్మ ఇంకా అనారోగ్యంతో ఉన్నాడని కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ పేర్కొన్నాడు. అనారోగ్యంతోనే అతను అమెరికాతో జరిగిన మ్యాచ్ ఆడాడని తెలిపారు. భారత కోచ్ ర్యాన్ టెన్ డోస్చాట్ మాట్లాడుతూ, “అభిషేక్ శర్మ ప్రస్తుతం కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. రెండు రోజుల్లో అతను పూర్తిగా ఫిట్‌గా ఉంటాడని, తదుపరి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నాము.” అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో, అభిషేక్ తన మొదటి బంతికే అవుట్ అయ్యాడు. అనారోగ్యం కారణంగా ఫీల్డింగ్‌కు కూడా రాలేదు. సంజు శాంసన్ కూడా నెట్స్‌లో చెమటోడ్చాడు. ఫిబ్రవరి 12వ తేదీకి ముందు అభిషేక్ శర్మ ఫిట్‌గా లేకుంటే, సంజు శాంసన్‌ను జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం ఉందని ఊహాగానాలు ఉన్నాయి. కంటిన్యూగా ఓపెనింగ్ అవకాశాలు పొందుతున్న శాంసన్ అనుకున్నంత రాణించలేకపోతున్నాడు. టీ20 ప్రపంచ కప2026లో భారత జట్టు తన తొలి మ్యాచ్‌ను అమెరికాతో 29 పరుగుల తేడాతో గెలుచుకుంది. తర్వాత మ్యాచ్ ఫిబ్రవరి 12న నమీబియాతో టీమిండియా తలపడనుంది, ఆ తర్వాత ఫిబ్రవరి 15న భారత్ ఞ పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఉంటుంది. ఈ మ్యాచ్ కోసం టీమిండియా కొలంబోకు వెళుతుంది.

# నా బౌలింగ్‌కు భారత్ భయపడుతోంది

## పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్

భారత అభిమానులు తన బౌలింగ్ చూసి భయపడుతున్నారని పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ అన్నాడు. అందుకే తన బౌలింగ్ గురించి ఎక్కువగా చర్చిస్తున్నారని అభిప్రాయపడ్డాడు. అమెరికాతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఉస్మాన్ తారిక్ (3/27) మూడు వికెట్లతో పాకిస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే ఉస్మాన్ తారిక్ బౌలింగ్ శైలి వివాదాస్పద రీతిలో ఉండటంతో సోషల్ మీడియా వేదికగా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా భారత నెటిజన్లు ఉస్మాన్ తారిక్‌ది త్రో బౌలింగ్ అని, ఐసీసీ ఎలా అనుమతిచ్చిందని ప్రశ్నించారు. ఉస్మాన్ తారిక్.. బంతిని విసిరే ముందు తన చేతులను విభిన్న కోణాల్లో తిప్పుతూ.. బ్యాటర్ దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తాడు. అతని యాక్షన్‌లో ఒక రకమైన 'హెజిటేషన'ఉంటుంది. ఆగి ఆగి వేయడం వల్ల బ్యాటర్ టైమింగ్ దెబ్బతింటుంది. చూడటానికి త్రో బౌలింగ్‌లా కనిపిస్తోంది.అమెరికాతో మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న ఉస్మాన్ తారిక్ ముందు భారత నెటిజన్ల విమర్శలను ప్రశ్నించగా..తన బౌలింగ్ చూసి వారంతా ఒత్తిడికి గురవుతున్నారని చెప్పాడు. 'ప్రస్తుతం జరుగుతున్న చర్చలు చూస్తుంటే.. ఒత్తిడి మాపై కంటే భారత జట్టుపైనే ఎక్కువగా ఉంటుందని నా అభిప్రాయం. వారు కొన్ని విషయాలను వ్యతిరేకిస్తున్న తీరు చూస్తుంటే అది స్పష్టమవుతోంది. అయితే మీడియాలో ఏం జరుగుతుందో నాకు అనవసరం. నా దృష్టి అంతా నా క్రికెట్, ప్రాక్టీస్‌పైనే ఉంది.'అని ఉస్మాన్ తారిక్ తెలిపాడు.జట్టు ప్రదర్శనపై వస్తున్న విమర్శలకు సమాధానంగా రికార్డుల గురించి ఆయన ఒక కొత్త కోణాన్ని ప్రస్తావించాడు. 'మనం రికార్డులను కేవలం ఓడిపోవడం ప్రారంభించినప్పటి నుంచి కాకుండా, మొదటి నుంచి లెక్కించాలి. అలా చూస్తే మనకు మంచి రికార్డు ఉందనే విషయం తెలుస్తుంది. అవి కూడా టైటిల్ మ్యాచ్‌లే అన్న విషయాన్ని మర్చిపోకూడదు. పాత విజయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నప్పుడే జట్టు అసలు బలం తెలుస్తుంది.

# ఉస్మాన్ తారిక్ బౌలింగ్ శైలిపై సందేహం!!

పాకిస్థాన్ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ బౌలింగ్ శైలిపై క్రికెట్ అభిమానులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అతని శైలి త్రో బౌలింగ్‌లా ఉందని ఆరోపిస్తున్నారు. బౌలింగ్ చేసే సమయంలో అతను చేతిని ఆపి మరి బౌలింగ్ చేస్తున్నాడని, ఈ బౌలింగ్‌ను ఎలా అనుమతించారని ఐసీసీని నిలదీస్తున్నారు. అతని బౌలింగ్ గల్లీ క్రికెటర్ బౌలర్‌ను తలపిస్తుందని కామెంట్ చేస్తున్నారు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అమెరికాతో కొలంబో వేదికగా జరిగన మ్యాచ్‌లో బరిలోకి దిగిన ఉస్మాన్ తారిక్(3/27) మూడు వికెట్లతో సత్తా చాటాడు. తన వినూత్నమైన బౌలింగ్‌తో అమెరికా పతనాన్ని శాసించాడు. అతని ప్రదర్శన కంటే బౌలింగ్ శైలి ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇది తొండాట అని, అతని బౌలింగ్‌ను పరీక్షించాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు.టీ20 ప్రపంచకప్ ముందు ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లోనూ అతని బౌలింగ్‌కు కామెరూన్ గ్రీన్ కూడా షాకయ్యాడు. అతని బౌలింగ్‌పై సందేహం వ్యక్తం చేశాడు. అయితే అతని బౌలింగ్‌పై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మిస్టరీ స్పిన్నర్ అయిన ఉస్మాన్ తారిక్.. బంతిని విసిరే ముందు తన చేతులను విభిన్న కోణాల్లో తిప్పుతూ.. బ్యాటర్ దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తాడు. అతని యాక్షన్‌లో ఒక రకమైన 'హెజిటేషన'ఉంటుంది. ఆగి ఆగి వేయడం వల్ల బ్యాటర్ టైమింగ్‌ను దెబ్బతింటుంది.ఐసీసీ నిబంధనల ప్రకారం, బంతిని విడుదల చేసే సమయంలో బౌలర్ చేయి 15 డిగ్రీల కంటే ఎక్కువ వంగకూడదు. ఉస్మాన్ తారిక్ యాక్షన్‌లో చేయి వంగడం లేదని ప్రాథమికంగా తేలడంతో అతనికి అనుమతి లభించింది.పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) సమయంలో అతని బౌలింగ్ యాక్షన్ గురించి కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. అతను బంతిని విసురుతున్నాడని ఆరోపించారు. గతంలో ఒకసారి అతని యాక్షన్‌పై అనుమానాలు రావడంతో 'సస్పీషియస్ బౌలింగ్ యాక్షన'కింద రిపోర్ట్ అయ్యింది. కానీ, అతను తన యాక్షన్‌ను సరిదిద్దుకుని మళ్ళీ మైదానంలోకి వచ్చాడు.ఉస్మాన్ తారిఖ్ చాలా వేగంగా ఫ్లిప్పర్లు, క్యారమ్ బాల్స్ వేయగలడు.

# వరుసగా వికెట్లు కోల్పోవడమే మా ఓటమిని శాసించింది



**మ్యాచ్ అనంతరం అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్**

పవర్ ప్లేలో వరుసగా వికెట్లు కోల్పోవడం తమ ఓటమిని శాసించిందని అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అన్నాడు. ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ అద్భుతంగా ఆడాడని చెప్పిన రషీద్ ఖాన్.. సూపర్ ఓవర్‌లో కాస్త తెలివిగా బ్యాటింగ్ చేయాల్సిందని అభిప్రాయపడ్డాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా సౌతాఫ్రికాతో బుధవారం ఉత్కంఠగా సాగిన తమ రెండో మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ డబుల్ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలైంది. సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌ను అఫ్గానిస్థాన్ చేజార్చుకుంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే డబుల్ సూపర్ ఓవర్‌లో గెలిచిన తొలి జట్టుగా సౌతాఫ్రికా చరిత్ర సృష్టించింది.ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన రషీద్ ఖాన్.. తమ ఆటగాళ్ల ప్రదర్శనను కొనియాడాడు. 'మా బౌలర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చారు. 10 ఓవర్లలోనే 100 పరుగులు చేసిన సౌతాఫ్రికాను 190 పరుగుల లోపు కట్టడి చేయడం మాములు విషయం కాదు. మా బౌలర్లు అద్భుతమైన పోరాట పటిమను కనబర్చారు. గుర్బాజ్ తనదైన శైలిలో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. మాకు గొప్ప ఆరంభాన్ని ఇచ్చాడు. పవర్‌ప్లే చివర్లో వరుసగా మూడు వికెట్లు కోల్పోవడం మమ్మల్ని వెనక్కి నెట్టింది. దాంతో గుర్బాజ్ కూడా కాస్త ఒత్తిడికి గురై నెమ్మదించాల్సి వచ్చింది. అయినప్పటికీ సూపర్ ఓవర్‌లో 3 సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లడం అద్భుతం. సూపర్ ఓవర్‌లో మేం కాస్త తెలివిగా బ్యాటింగ్ చేయాల్సింది. మాకు విజయవకాశాలు లభించాయి. కానీ బ్యాటింగ్ చేసేటప్పుడు ఇంకాస్త తెలివిగా వ్యవహరించి ఉండాల్సింది. ఒక మంచి డైవ్ లేదా ఒక మంచి బంతి.. ఫలితాన్ని మార్చేసేవి. 1 బంతికి 5 పరుగులు అంటే అది ఎవరికైనా సాధ్యమే. ఈ మ్యాచ్ నుంచి మేం నేర్చుకోవాల్సింది చాలా ఉంది.గత ఏడాదిన్నర కాలంగా ఈ ఒక్క మ్యాచ్ గెలిచి తదుపరి రౌండ్‌కు వెళ్లాలని కష్టపడ్డాం. ఇది చాలా నిరాశ కలిగించే విషయం. కుర్రాళ్ళను మళ్ళీ మానసికంగా సిద్ధం చేయడం కష్టం. కానీ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఆత్మగౌరవం కోసం ఆడాలి. మా దేశ ప్రజలు మా నుంచి విజయాలను కోరుకుంటున్నారు. వచ్చే మ్యాచ్‌లో మరింత దృఢమైన మనస్తత్వంతో..గొప్ప ప్రణాళికలతో బరిలోకి దిగుతాం.'అని రషీద్ ఖాన్ చెప్పుకొచ్చాడు.

# షమీ, సర్ఫరాజ్ ఖాన్‌లకు మొండిచేయి

**భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-26 సీజన్‌కు సంబంధించి ఆటగాళ్ల వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను విడుదల చేసింది. ఈసారి ప్రకటించిన జాబితాలో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. టీమిండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గ్రేడ్ తగ్గడం ఒక ఎత్తైతే.. స్టార్ పేసర్ మహమ్మద్ షమీ, యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్లేయర్లకు అసలు కాంట్రాక్టే దక్కకపోవడం మరో ఎత్తు. గతంలో 34 మందికి చోటు కల్పించిన బీసీసీఐ, ఈసారి ఆ సంఖ్యను 30కి తగ్గించింది. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఒక నిర్దిష్ట సీజన్‌లో కనీసం నిర్ణీత సంఖ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడితేనే సెంట్రల్ కాంట్రాక్‌ట్‌కు అర్హత లభిస్తుంది. మహమ్మద్ షమీ, సర్ఫరాజ్ ఖాన్, ఇషాన్ కిషన్, ముకేశ్ కుమార్‌లు గత కాంట్రాక్ట్ సైకిల్‌లో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడలేదు. షమీ గాయం కారణంగా సుదీర్ఘ కాలం దూరంగా ఉండగా, సర్ఫరాజ్ ఖాన్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నా తుది జట్టులో అవకాశం దక్కలేదు. దీంతో వీరికి కాంట్రాక్ట్ రెన్యూవల్ కాలేదు. ఇది షమీ కెరీర్‌పై సెలక్టర్ల ఆలోచనను స్పష్టం చేస్తోంది. ఈసారి గ్రేడ్-ఏ లో కేవలం శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా మాత్రమే చోటు దక్కించుకున్నారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గ్రేడ్-బీ కి పరిమితమయ్యారు.**

# డబ్బు కోసమే పాక్ దిగివచ్చింది: హర్భజన్ సింగ్



టీ20 వరల్డ్ కప్ 2026లో ఫిబ్రవరి 15న జరగనున్న భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌పై నెలకొన్న హైడ్రామా ముగిసింది. మొదట ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని భీష్మించుకు కూర్చున్న పాకిస్థాన్, చివరి నిమిషంలో యూటర్న్ తీసుకుంది. ఈ నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సౌరవ్ గంగూలీ, మదన్ లాల్ వంటి ప్రముఖులు తమదైన శైలిలో స్పందించారు. పాక్ వెనక్కి తగ్గడానికి ప్రధాన కారణం డబ్బు, ఐసీసీ జరిమానాల భయమేనని వారు విశ్లేషిస్తున్నారు.టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ పాకిస్థాన్ నిర్ణయాన్ని తీవ్రంగా ఎద్దేవా చేశారు. “భారత్ లేకపోయినా ఈ టోర్నీ సాగుతుంది కానీ, భారత్ లేకపోతే ఏదీ జరగదు అన్న నిజాన్ని పాకిస్థాన్ ఆలస్యంగా గుర్తించింది. బంగ్లాదేశ్‌కు మద్దతు ఇస్తున్నామని, భారత్‌తో ఆడబోమని గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఈ మ్యాచ్ ఆడకపోతే వచ్చే ఆర్థిక నష్టం, ఐసీసీ విధించే జరిమానాలు, భవిష్యత్తులో టోర్నీల ఆతిథ్య హక్కులు కోల్పోతామనే భయం వారిని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అందుకే ఇప్పుడు గత్యంతరం లేక దారిలోకి వచ్చారు” అని భజ్జీ ఏఎన్ఐతో మాట్లాడుతూ పేర్కొన్నారు.మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మాత్రం ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. క్రీడలను, రాజకీయాన్ని విడివిడిగా చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు. “భారత్‌పాక్ మ్యాచ్‌లు ఎప్పుడూ ఉత్సాహాన్నిస్తాయి. గత కొన్నేళ్లుగా పాకిస్థాన్ నుంచి సరైన పోటీ లేకపోయినా, ఈ మ్యాచ్ జరగడం మంచి పరిణామం. టీమిండియా ప్రస్తుతం చాలా బలంగా ఉంది, వారిని ఓడించడం పాకిస్థాన్‌కు అంత సులభం కాదు” అని గంగూలీ వ్యాఖ్యానించారు.మరో మాజీ క్రికెటర్ అతుల్ వాసన్ పాక్ తీరును డ్రామాగా అభివర్ణించారు. “ఒకసారి ఆడమంటారు, మరోసారి కోపం అంటారు. ఇలాంటి వింత చేష్టల వల్ల పాక్ ఆటగాళ్ల మనోధైర్యం దెబ్బతింటుంది. ఐసీసీ మీద కోపం ఉంటే టోర్నీ మొత్తాన్నే బహిష్కరించాలి కానీ, కేవలం భారత్ మ్యాచ్‌ను ఇష్యూ చేయడం ఏంటి?” అని ఆయన ప్రశ్నించారు. అలాగే, 1983 వరల్డ్ కప్ హీరో మదన్ లాల్ మాట్లాడుతూ.. ఈ మ్యాచ్ జరగకపోతే టోర్నీ కళ తప్పుతుందని, శ్రీలంక, బంగ్లాదేశ్ ఒత్తిడి వల్ల పాక్ వెనక్కి తగ్గడం శుభపరిణామమని అన్నారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో, కోల్‌కతా నైట్ రైడర్స్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ స్క్వాడ్ నుంచి తొలగించగా, భద్రతా కారణాల దృష్ట్యా తమ మ్యాచ్‌లను భారత్ వెలుపల నిర్వహించాలని బంగ్లాదేశ్ కోరింది. ఐసీసీ దీనిని తిరస్కరించడంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను చేర్చారు. దీనికి నిరసనగా పాకిస్థాన్ మొదట భారత్ మ్యాచ్‌ను బహిష్కరించాలని చూసింది. అయితే, శ్రీలంక అధ్యక్షుడు, ఐసీసీ అధికారులతో చర్చల అనంతరం, పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తన జట్టును ఫిబ్రవరి 15న కొలంబోలో ఆడాలని ఆదేశించారు.

# ధోని ప్రపంచ రికార్డును సమం చేసిన డి కాక్

ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026లో చిన్న జట్లు అద్భుతంగా రాణిస్తాయి. పెద్ద జట్లను దాదాపు ఓడించినంత పని చేస్తున్నాయి. మరోవైపు స్టార్ క్రికెటర్లు రికార్డుల వేటలో పడ్డారు. దక్షిణాఫ్రికా స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డి కాక్ మాజీ భారత కెప్టెన్ ధోనీ ప్రపంచ రికార్డును సమం చేశాడు. కెనడాతో జరిగిన మ్యాచ్‌లో క్వింటన్ రెండు క్యాచ్‌లు అందుకున్నాడు. దీంతో డికాక్ టీ20 ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్ల రికార్డులో ధోనీతో సమం చేశాడు. టీ20 ప్రపంచ కప్‌లో డికాక్ మొత్తం 32 వికెట్లలో భాగస్వామిగా ఉన్నాడు. ధోనీ కూడా తన టీ20 ఇంటర్నేషనల్ కెరీర్‌లో 32 మంది బ్యాటర్లను వికెట్ కీపింగ్ ద్వారా డిస్మిసల్స్ చేశాడు. ఇప్పుడు డి కాక్ చరిత్ర సృష్టించడానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాడు. నెక్ట్స్ మ్యాచ్‌లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించవచ్చు. పొట్టి ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక వికెట్లలో పాలు పంచుకున్న వికెట్ కీపర్ విషయానికి వస్తే.. టాప్ లో క్వింటన్ డికాక్, ఎంఎస్ ధోనీ ఉన్నారు. కమ్రాన్ అక్మల్ మూడో స్థానంలో, వెస్టిండీస్ దినేష్ రామదిన్ నాల్గవ స్థానంలో, శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ ఐదవ స్థానంలో ఉన్నారు. కెనడాతో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రోటీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ అర్ధ సెంచరీ సాధించి 59 పరుగులు చేశాడు. రయాన్ రికల్టన్ 33 పరుగులు, డేవిడ్ మిల్లర్ 23 బంతుల్లో 39 పరుగులు, ట్రిస్టన్ స్టబ్స్ 19 బంతుల్లో 34 పరుగులు చేశారు. కెనడా బౌలర్ అంష్ పటేల్ మెరిశాడు. 31 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. 214 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన కెనడా జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు మాత్రమే చేసింది. నవనీత్ ధాలివాల్ 64 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇతర బ్యాటర్ల నుంచి అతడికి సహకారం లభించలేదు.



# నిఖిల్ స్వయంభు టీజర్ విడుదల



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఆ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ', 'సలార' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ`2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# పవన్, సురేందర్ రెడ్డి కాంబో పక్కా మాస్ ఎంటర్ టైనర్ మూవీ




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై `వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే, ఇందులో పవన్ కళ్యాణ్‌కు తమ్ముడిగా ఒక యువ అగ్ర హీరో నటించే అవకాశం ఉందని, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ మూవీగా ఇది ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. నిర్మాత రామ్ తాళ్లూరి దాదాపు రూ. 250 కోట్ల భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతల నడుమ షూటింగ్‌లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ పక్కా ప్లాన్‌తో ఉన్నారు. ఇప్పటికే పవన్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ' మార్చి 26, విడుదల కానుండగా, ఆ వెంటనే ఈ భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది.

# వైరల్‌గా అల్లు అర్జున్ '42 రూల్స్' లిస్ట్

**యాడ్ షూటింగ్‌కు సంబంధించి కావేరీ బారువా అనే బ్రాండ్ స్ట్రాటజర్ ఓ పాడ్‌కాస్ట్‌లో చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ప్రముఖంగా అల్లు అర్జున్ పేరుని ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. బన్నీలాంటి హీరోతో వాణిజ్య ప్రకటనల్ని షూట్ చేయాలంటే 42 నిబంధనల్ని పాటించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే.. 'ఆ రూల్స్ ఇవేనంటూ' సోషల్ మీడియాలో ఓ ఫొటో వైరల్‌గా మారింది. దీనిపై అల్లు అర్జున్ టీమ్ తాజాగా స్పందించింది. అది ఫేక్ అని స్పష్టం చేసింది. "సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న '42 నిబంధనల జాబితా' నకిలీది. దీనిని క్రియేట్ చేసిన వ్యక్తిని గుర్తించాం. అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నాం" అని తెలిపారు.**

**కావేరీ బారువా చేసిన కామెంట్స్‌ను అల్లు అర్జున్ టీమ్ ఇప్పటికే ఖండించిన విషయం విదితమే. అవి నిరాధారమైన ఆరోపణలు అని, ఈ మేరకు తమ న్యాయబృందం చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించిందని తెలిపింది.**

# ఇక డాక్టర్ శ్రీలీల

**ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకున్న నటి**

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వొకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేకదృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.



# తొలి జీతంతో స్కూలు ప్రారభం

**నటి మోనాలిసా కీలక నిర్ణయం**



మహా కుంభమేళాలో పూసల దండలు అమ్ముతూ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించిన 'కుంభమేళా బ్యూటీ' మోనాలిసా ఇప్పుడు తన జీవితంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. తన మొదటి సినిమా నుంచి వచ్చే రెమ్యునరేషన్‌తో బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభిస్తానని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. సాధారణ జీవితం నుంచి సినీ రంగం వరకు ఆమె చేసిన ఈ ప్రయాణం ఇప్పుడు ఎంతో మందికి ప్రేరణగా మారింది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సమయంలో మోనాలిసా దండలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెకు అనూహ్యంగా సినిమా అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం ఆమె సినీ పరిశ్రమలో అడుగుపెట్టి వరుస చిత్రాలతో బిజీగా మారింది. ఇటీవల ఆమె తొలి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని భావోద్వేగానికి గురైంది. సినీ ప్రపంచంలోకి వచ్చినా తన పాత జీవితాన్ని ఎప్పటికీ మర్చిపోనని, ఆ అనుభవాలే తనకు బలం ఇచ్చాయని తెలిపింది. ఇటీవల మోనాలిసా మళ్లీ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి గంగా తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. తన జీవితాన్ని మార్చిన ఆ స్థలానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజానికి తిరిగి ఏదో చేయాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో బాలికల కోసం పాఠశాల స్థాపించాలన్నదే తన కల అని చెప్పింది. ఆ ప్రాంతాల్లో అమ్మాయిలకు సరైన విద్యావకాశాలు లేవని, చదువు లేక వెనుకబడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

బాలికల విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, అందుకే తన సంపాదనను వ్యక్తిగత సౌకర్యాల కోసం కాకుండా భవిష్యత్ తరాల కోసం వినియోగించాలనుకుంటున్నానని మోనాలిసా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆమె మూడు సినిమాలతో బిజీగా ఉంది. అందులో రెండు తెలుగు చిత్రాలు కాగా, మరోటి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర'. సినీ రంగంలో ఎదుగుతూ సమాజానికి సేవ చేయాలన్న ఆమె సంకల్పం నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

# ఓటిటిలోనూ దురంధర్ దూకుడు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర'. దాదాపు రెండు నెలలు థియేటర్‌లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర'.. జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది. పదిరోజుల్లో ఈ సినిమాకు దాదాపు 16 మిలియన్ల వ్యూస్ (15.9) వచ్చినట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. మొదటి మూడు రోజుల్లోనే 7.6మిలియన్ల వ్యూస్‌తో గ్లోబల్ టాప్`10 నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానంలో నిలిచిన 'ధురంధర'. ఫిబ్రవరి 2 నుంచి 8 వరకూ 8.2 మిలియన్ల వ్యూస్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 11 దేశాల్లో నం.1 స్థానంలో కొనసాగుతోంది. తొలిభాగం సూపర్ హిట్ కావడంతో చిత్రం రెట్టింపు ఉత్సాహంతో రెండో పార్ట్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. మొదటి భాగానికి మించి ఇది విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత జ్యోతి దేశ్‌పాండే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర2' రెడీ అవుతోంది. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్ పార్ట2పై అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.



# దర్శకురాలిగా వరలక్ష్మీ శరత్‌కుమార్

'క్రాక్', 'నాంది' తదితర చిత్రాల్లోని పవర్‌ఫుల్ పాత్రలతో తెలుగు ప్రేక్షకులకు ఆకట్టుకున్న కోలీవుడ్ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ ఇప్పుడామె కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. దర్శకురాలిగా ఓ సినిమాని తెరకెక్కిస్తున్నానంటూ సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. తన చిత్రానికి 'సరస్వతి' టైటిల్ ఖరారైందని, త్వరలోనే థియేటర్లలో విడుదల కానుందని తెలిపారు. ఈ మేరకు పంచుకున్న వీడియో నవ్వులు పూయిస్తోంది. స్వీయ దర్శకత్వంలో నటించాల్సి వస్తే ఎలా ఉంటుందో ఈ వీడియోలో వినోదాత్మకంగా చూపించారు.

ప్రముఖ నటుడు శరత్‌కుమార్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి వచ్చినా.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు వరలక్ష్మి. కెరీర్ ప్రారంభంలో కోలీవుడ్‌లో హీరోయిన్‌గా అలరించి.. తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారారు. 'తెనాలి రామకృష్ణ బీఏబీఎల్'తో టాలీవుడ్‌లోకి వచ్చిన ఆమె.. నెగెటివ్ షేడ్ క్యారెక్టర్లకు, పవర్‌ఫుల్ పోలీసు ఆఫీసర్ రోల్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. నటిగా 'సరస్వతి'తోపాటు 'ధీరమ్' అనే మలయాళం సినిమాలో నటిస్తున్నారు. 'రిజానా ఎ కేజ్డ్ బర్డ్'తో హాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నారు.




# పవన్ షూటింగ్ చూసేందుకు వెళ్లి లాఠీ దెబ్బలు తిన్నా

**పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కోసం ఒక ఘటనలో తాను కూడా లాఠీ దెబ్బలు తిన్నానని యంగ్ హీరో సంతోష్ శోభన్ తాజాగా వెల్లడించాడు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. పవన్ కళ్యాణ్‌ను ప్రత్యక్షంగా ఎక్కువసార్లు చూడలేదని, అయితే ఒకసారి 'అత్తారింటికి దారేది' సినిమా షూటింగ్ సమయంలో ఆయనను చూసేందుకు వెళ్లిన అనుభవాన్ని పంచుకున్నారు. సంతోష్ శోభన్ మాట్లాడుతూ.. 'ఆ సమయంలో పవన్ కళ్యాణ్ గారి క్రేజ్ చాలా ఎక్కువగా ఉండేది. షూటింగ్ అవుట్‌డోర్‌లో జరగడంతో భారీ సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన పోలీసులు జనాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో తోపులాటలు జరిగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అప్పుడు అక్కడున్న అభిమానులతో పాటు నాకు కూడా లాఠీ దెబ్బలు పడ్డాయి' అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంతోష్ శోభన్ నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా రిలీజ్‌కు ముందు ఈ వ్యాఖ్యలు చిత్రంపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.**



PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154